

భూ మాయం

భూమిని మాయం చేయడంలో ఆయన దిట్ట. ఎలాంటి భూమి లేకపోయినా ఉన్నట్లు సృష్టించి మరీ ఆన్‌లైన్, రిజిస్ట్రేషన్ చేసిన అందరి బోల్తా కొట్టించాడు. ఈ ఘటన మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. పాణ్యంకు చెందిన షేక్ జాకీర్ హుసేన్, జవహర్ హుసేన్, అక్బర్ హుసేన్ సోదరులు. తన తండ్రి మాలి హుసేన్ నుంచి 1226 సర్వే నెంబర్‌లోని 2. 48 ఎకరాలు సంక్రమించింది. వీరి తల్లి ఖమురున్‌బీతో కలిపి సమానంగా ఒక్కొక్కరికి 62 సెంట్ల భూమి చొప్పున పంపిణీ చేసుకున్నారు. పట్టాదారు పాసుపుస్తకం పొందారు. ఇటీవలే జాకీర్ హుసేన్ పంట రుణం కోసం మీసేవా కేంద్రానికి వెళ్లాడు. తనకు ఉండాల్సిన 62 సెంట్ల భూమికి బదులుగా 31 సెంట్లు మాత్రమే కనిపిస్తుంది. సమస్యను రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. రిజిస్ట్రేషన్ ప్రకారం ఆన్‌లైన్ జరిగినట్లు తెలియడంతో కూపీ లాగాడు. ఆశ్చర్య కరమైన నిజాలు బయట పడ్డాయి.

- పాణ్యం(ఆంధ్రజ్యోతి)

- అక్రమంగా 1.15 ఎకరాలు స్వాహా
- నకిలీ పత్రాలతో ఆన్‌లైన్, రిజిస్ట్రేషన్
- రికార్డులు లేకపోయినా లేఅవుట్ నిర్మాణం
- లబోదిబోమంటున్న బాధితులు
- పరారీలో అక్రమార్కుడు నాగరాజు

లేని భూమికి సబ్‌డివిజన్ చేసి మరీ..

నంద్యాల పట్టణానికి చెందిన బొగ్గరపు నాగ రాజు అనే వ్యక్తి జాకీర్‌హుసేన్, ఆయన సోద రుల భూమిలో 93 సెంట్లను, తల్లికి చెందిన 22 సెంట్లు, మొత్తం 1.15 ఎకరాలు అక్రమంగా రిజి స్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలిసింది. రిజిస్ట్రేషన్ సమయంలో నకిలీ పత్రాలు సృష్టించి జాకీర్ భూమి పక్కనే సబ్‌డివిజన్ చేసినట్లు నకిలీ పత్రాలతో 1226/జీ సర్వే నెంబరు సృష్టించి 2024 ఫిబ్రవరి 22 వ తేదీన రిజిస్ట్రేషన్ చేయించారు. లేని భూమికి సబ్‌డివిజన్ చేసి మరీ రిజిస్ట్రేషన్ చేయడం కొసమెరుపు. ఎటువంటి లింకు డాక్యుమెంట్లు లేకుండా రిజిస్ట్రేషన్ ఎలా చేశారన్నది ప్రశ్నగా మారింది.



పాణ్యంలో అక్రమంగా వేసిన లేఅవుట్

భూహక్కుదారులు ఆశ్చర్యం

జాకీర్ సోదరుల భూమిలో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న భూమికి రెవెన్యూ శాఖ మ్యూటేషన్ చేసి 2024 ఫిబ్రవరి 28న పట్టాదారు పాసుపుస్తకం ఖాతా నెంబరు 3157 తో మంజూరు చేసింది. దీంతో బొగ్గరపు నాగరాజు ఏకంగా ఆభూమిలో అక్రమంగా లేఅవుట్లు వేశారు. తమ భూమిలో లేఅవుట్లు వెలవడంతో భూహక్కు దారులు ఆశ్చర్యానికి గురయ్యారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో స్పందనలో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. బొగ్గరపు నాగరాజు పలు చోట్ల అక్రమంగా భూములు నకిలీ పత్రాలతో ఆక్రమించి పలు ప్రైవేటు, ప్రభుత్వ బ్యాంకుల్లో రుణాలు పొందినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతేడాది ఫోర్జరీ సంతకాలతో నకిలీ పత్రాలు సృష్టించి బెంగళూరుకు చెందిన మనూ అనే వ్యక్తి వద్ద కోట్లాది రూపాయలు పొందడానికి ప్రయత్నించగా మనూ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నంద్యాల మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. నాగరాజు పరారీలో ఉన్నట్లు తెలిసింది. భూములను ఆన్‌లైన్‌లో పోగొట్టుకున్న రైతులు తమకు పంట రుణాలు పొందలేక లబోదిబోమం టున్నారు. నాగరాజుపై క్రిమినల్ కేసు నమోదుచేసి అరెస్టు చేయాలని బాధితులు కోరుతున్నారు.

ఆర్డీవో అప్పీలు తర్వాతే విచారణ



జాకీర్‌హుసేన్ ఫిర్యాదును పరిశీలించాం. నాగరాజు పరారీలో ఉండడంతో అతడిని విచారించలేం. ఆర్డీవోకు అప్పీలుకు వెళ్లాలని జాకీర్ హుసేన్‌కు సూచించాం. నాగరాజు రికార్డులు పరిశీలించలేదు కాబట్టి జాకీర్‌హుసేన్ కోల్పోయిన భూమిని ఆన్‌లైన్ చేసే అధికారం మాకు లేదు. ఆర్డీవో అప్పీలు అనంతరం ఇచ్చే ఆదేశాల మేరకు విచారణ చేపడతాం.

● నరేంద్రనాథ్ రెడ్డి, తహసీల్దార్, పాణ్యం

నకిలీ పత్రాలు సృష్టించి ఆన్‌లైన్ చేశారు



మాకు వంశపారంపర్యంగా సంక్రమించిన భూమిని మేము నలుగురం అన్నదమ్ములం పంచుకున్నాం. దాదాపు ఇరవై యేళ్లుగా 1226 సర్వే నెంబరులోని 2.48 ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్నాం. నంద్యాలకు చెందిన బొగ్గరపు నాగరాజు అనే వ్యక్తి మా భూమిపై నకిలీ పత్రాలు సృష్టించి మా భూమిలోని 1.15 ఎకరాల భూమిని తన పేరున రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. మా భూమితో పాటు మరో ఎకరా భూమిని రిజిస్ట్రేషన్ చేసి అక్రమంగా లేఅవుట్ వేసి స్థలాలు అమ్మడానికి సిద్ధమయ్యాడు. దీంతో మేము రెవెన్యూ అధికారుల దృష్టికి మా సమస్యను తీసుకువెళ్లాం. మా పొలాన్ని మాకు ఆన్‌లైన్ చేయాలని కోరాం. దీనికి అధికారులు తమకు ఆన్‌లైన్ చేసే అధికారం లేదని ఆర్డీవోకు ఫిర్యాదు చేసి వారి అనుమతి మేరకు ఆన్‌లైన్ చేస్తామన్నారు.

● జాకీర్ హుసేన్, బాధితుడు, పాణ్యం

ఒక్క గేటు ద్వారా నీరు విడుదల

● సందర్శకులతో శ్రీశైలం ప్రాజెక్టు మార్గంలో భారీగా ట్రాఫిక్ జామ్



ఒక్క గేటు ద్వారా విడుదలవుతున్న నీరు

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయంలో శనివారం ఉదయం రెండు గేట్లను మూసివేసి ఒక్క గేటు ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. స్పిల్‌వే ద్వారా 27,157 క్యూసెక్కులు, కుడి, ఎడమగట్టు జల విద్యుత్ కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ 68,377 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువన ఉన్న జూరాల, సుంకేసుల జలాశయాల నుంచి 1,39,297 క్యూసెక్కుల నీరు శ్రీశైలం జలాశయానికి చేరుకుంటోంది. శనివారం సాయంత్రానికి శ్రీశైలం జలాశయ నీటిమట్టం 883 అడుగులకు చేరుకుంది. శ్రీశైలం ప్రాజెక్టును వీక్షించేందుకు తరలివచ్చిన సందర్శకులతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ప్రాజెక్టు గేట్లు ఎత్తిన నేపథ్యంలో ఆదృశ్యాలను వీక్షించేందుకు పర్యాటకులు అధిక సంఖ్యలో శ్రీశైలం చేరుకున్నారు.



శ్రీశైలం ప్రాజెక్టు మార్గంలో ట్రాఫిక్ జామ్

హజ్ యాత్రకు దరఖాస్తు చేసుకోండి

● రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు సూరి మన్సూర్ ఆలీఖాన్

కర్నూలు అర్బన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): హజ్ యాత్ర-2026 వెళ్లాలనుకునే ముస్లింలు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు సూరి మన్సూర్ ఆలీఖాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారి పాస్‌పోర్టు 2026 డిసెంబరు 31 వరకు చెల్లుబాటు అవ్వాల్సి ఉంటుందని వివరించారు. యాత్రికులందరూ విజయవాడ ఎంబా ర్కేషన్ కేంద్రంను తమ తొలి ప్రాధాన్యతగా ఎంచుకోవాలని పేర్కొన్నారు. ఈకేంద్రం నుంచి హజ్ యాత్రకు వెళ్లే ప్రతి యాత్రికుడికి కూటమి ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. యాత్రికులు రాష్ట్రానికి కేటాయించిన పూర్తి కోటాను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

శ్రీశైలంలో భక్తుల రద్దీ

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భ్రమరాంబికా మల్లికార్జునస్వామి ఆలయంలో మల్లన్న దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. రెండో శనివారం సెలవు రోజు కావడంతో తెల్లవారుజాము నుంచే భక్తులు పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి, స్వామి అమ్మవార్ల దర్శనార్థం క్యూలైన్లలో బారులు తీరారు. భక్తులకు దేవస్థానం అధికారులు నిరంతరం తాగునీరు, అల్పాహారం అందించారు.



దర్శనానికి వేచి ఉన్న భక్తులు

తెలుగు భాషకు పూర్వవైభవం తీసుకువద్దాం

- విశ్రాంత ఐఏఎస్ అధికారి నందివెలుగు ముక్తేశ్వరరావు
- ఘనంగా రాష్ట్ర తెలుగు భాషా పరిరక్షణ సదస్సు ప్రారంభం



సదస్సును జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభిస్తున్న కేసీ కల్కూర, జేఎస్ఆర్‌కే శర్మ, పత్తి ఓబులయ్య తదితరులు

6లో

రాష్ట్రాన్ని అప్పుల పాలుచేస్తే పోరాటాలే

- ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిందే
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
- ఎరుపెక్కిన పోరాటాల గడ్డ పత్తికొండ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

పత్తికొండటౌన్, జూలై12(ఆంధ్రజ్యోతి): కోట్లాది రూపాయలు అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని దివాలా తీయాలని చూస్తే పోరాటాలు తప్పవని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ హెచ్చరించారు. శనివారం పట్టణంలోని సీపీఐ నియోజకవర్గ మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరైన రామకృష్ణ మాట్లాడారు. ఎన్నికల వేళ అనేక హామీలను గుప్పించారని, అధికారంలోకి వచ్చి ఏడాది ముగియగా ఏమి అభివృద్ధి చేశారో సమాధానం చెప్పాలన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అప్పులు తెచ్చి సంక్షేమానికి ఖర్చు పెడుతున్నప్పుడు అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు ఈరాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేసి, శ్రీలంకగా మారుస్తాడంటూ ఎద్దేవా చేశారన్నారు. మీరు అధికారంలో ఉండి ఏమి ఉద్ధరించారో సమాధానం చెప్పాలన్నారు. అదానీ లాంటి ధనవంతులకు ఖజానాను కట్టబెట్టేందుకే పాలకులు పన్నాగం పన్నుతున్నారన్నారు. ప్రతి హామీని నెరవేర్చాల్సిందేనని అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రామచంద్రయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య మాట్లాడుతూ కేంద్రంలో, రాష్ట్రంలో పరిపాలన సాగిస్తున్న పాలకులు ప్రజా సంక్షేమాన్ని, రైతు సంక్షేమాన్ని మరిచారన్నారు. కర్నూలు జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయడం ద్వారా ఈ జిల్లానే సస్యశ్యామలం అవుతుందన్నారు. సీపీఐ మండల కార్యదర్శి రాజాసాహెబ్ అధ్యక్షతన జరిగిన ఈసభలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శేఖర్, లెనిన్‌బాబు, జిల్లా కార్యదర్శి సభ్యులు నబీరసూల్, రంగన్న, విరుపాక్షి, కారుమంచి, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కదం తొక్కిన ఎర్రసైన్యం

సీపీఐ నియోజకవర్గ మహాసభల సందర్భంగా ఎర్రదండు సైన్యంతో పోరాటాల గడ్డ పత్తికొండ ఎరుపెక్కింది. స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్టుహౌస్ నుంచి వేలాది మంది కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రదర్శన అగ్రభాగాన డప్పుల శబ్దానికి గొరవయ్యల, లంబాడీల, చిన్నారుల కోలాటాల నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. వందలాది మంది మహిళలు ఎర్రచీరలు ధరించి ఎర్రజెండాలు పట్టుకుని కదిలివచ్చారు. ప్రజానాట్యమండలి ఆలపించిన విప్లవగేయాలు ప్రజల్ని ఆకట్టుకున్నాయి.

మిగతా 6వ పేజీలో

చివరి ఆయకట్టు వరకు నీళ్లు

● ఖరీఫ్‌లో రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు ● ఐఏబీ సమావేశంలో ప్రజాప్రతినిధులు



సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఎస్సార్బీసీ, కేసీ కెనాల్, తెలుగుగంగ వంటి ప్రధాన కాలువలతో పాటు జిల్లాలోని అన్ని కాలవలకు శనివారం అర్ధరాత్రి నుంచే నీటిని విడుదల చేస్తామని, ఖరీఫ్‌కు సంబంధించి ఈ ఏడాది ప్రతి చివరి ఆయకట్టుకు నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రజాప్రతినిధులు తెలిపారు. నంద్యాల కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో కలెక్టర్ రాజకుమారి ఆధ్వర్యంలో జరిగిన ఐఏబీ సమావేశంలో రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, రోడ్లు, భవనాలు మౌలిక సదుపాయలు, పెట్టుబడులశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్యేలు గౌరుచరితా రెడ్డి, భూమా అఖిలప్రియ, బుడ్డా రాజశేఖరరెడ్డి, గిత్తా జయసూర్య హాజరయ్యారు. మంత్రులు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శనివారం అర్ధరాత్రి నుంచి అన్ని ప్రధాన కాలువలకు నీటిని విడుదల చేస్తామన్నారు. సాగునీటికి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నామని, నీటిని వృథా చేయవద్దని రైతులకు సూచించారు. జిల్లాలో ప్రతి రైతు వరి సాగు చేయడంతో సమస్యలు వస్తున్నాయని, సీజన్ పంటలపై దృషి సారించాలని సూచించారు. 15ఏళ్ల చరిత్రలో లేని విధంగా ఈ ఏడాది ఖరీఫ్ పంటలకు 20 రోజులు ముందుగానే నీటిని విడుదల చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ నీటిపారుదలశాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ ఆళ్లగడ్డలో కేసీ కెనాల్ కాల్వలను మీద వెంచర్ వేసిన వారిపై ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో లస్కర్ల కొరత వల్ల రైతులకు సక్రమంగా నీళ్లు చేరడం లేదని, వెంటనే లస్కర్ల పోస్టులు భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

పులివెందులకు నీళ్లు తీసుకెళ్లిన ఘనత సీఎం చంద్రబాబుదే: మంత్రి బీసీ

గాలేరు నగరి సుజల స్రవంతి ద్వారా పులివెందులకు కూడా నీళ్లు ఇచ్చిన ఘనత సీఎం చంద్రబాబుదేనని రోడ్లు, భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. గోరుకల్లు రిజర్వాయర్ మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఆధ్వర్యంలో ప్రారంభిస్తే గతంలో టీడీపీ ప్రభుత్వం రూ.300 కోట్ల నిధులు ఖర్చు చేయడంతో నేడు ఆ రిజర్వాయర్ ద్వారా కడప, నంద్యాల జిల్లాల్లో సుమారు రెండు లక్షల ఆయకట్టుకు నీరు అందిస్తున్నామని చెప్పారు. సీఎం చంద్రబాబు ఆశీస్సులతోనే అవుకు రిజర్వాయర్‌కు కూడా నీళ్లు తెచ్చామన్నారు. పులివెందులకు కూడా గాలేరు, నగరి సుజలస్రవంతి ప్రాజెక్టులో దశాబ్ద కాలంగా కాలువలు తవ్వి వదిలిపెడితే, సమస్యలన్నింటినీ అధిగమించి అవుకు ప్రాజెక్టుకు నీళ్లు నింపిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదే అన్నారు. గత ప్రభుత్వం అలగనూరు ప్రాజెక్టుకు కనీసం రూ.3కోట్లు ఖర్చు చేయకుండా వదిలేశారని చెప్పారు.

మిగతా 6వ పేజీలో



హాజరైన అధికారులు

పుణ్య స్నానాలకు వెళ్లి.. గల్లంతు

- తుంగభద్ర నదిలో ముగ్గురు గల్లంతు
- ప్రాణాలతో బయట పడిన నలుగురు యువకులు
- వీరంతా డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులే
- వీఐపీ స్నాన ఘట్టం సమీపంలో ఘటన
- ముమ్మరంగా గాలింపు చర్యలు

7



నదిలో పుట్టీలతో గాలింపు చేస్తున్న ఎస్ఐ శివాంజల్, గ్రామ సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య


అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

7

తుంగభద్ర తీరం
సాహిత్యం



శాస్త్రీయ ఆలోచనా విధానానికి
దర్పణమే హేతువాదం




జేవీ క్రిష్ణయ్య

కర్నూలు కల్చరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): 'అసతోమా సద్గమయ...తమసోమా జ్యోతిర్గమయ' అని కఠోపనిషత్తు చెబుతుంది. అంటే చెడు నుంచీ మంచివైపునకు, అజ్ఞానం నుంచీ జ్ఞానం వైపునకు వెళ్లడం మానవ లక్షణం. అదే విధంగా సమాజం, మతం అనే చీకటి నుంచీ హేతువాదం అనబడే జ్ఞానం వైపు ఆలోచిస్తేనే ఉత్తమ సమాజం ఏర్పడుతుంది. అంతకు మించింది ఏదీ లేదని, శాస్త్రీయ ఆలోచనా విధానంలో ప్రతి ఒక్కరూ ముందుకు వెళ్లాలని 'హేతువాదం' పుస్తకం ఉద్బోధిస్తుంది. అందుకే ఈ పుస్తకం ముఖచిత్రంలోనే రచయిత హేతువాదం వ్యక్తిగత సామాజిక అభివృద్ధికి తోడ్పడుతుందా..? అంటూ ప్రశ్నిస్తూనే 300 పేజీలకు పైచిలుకుగల ఈ పుస్తకాన్ని ముందుకు తీసుకువచ్చారు. ఈ పుస్తకంలో ప్రముఖ వైద్యుడు, విజయవాడ నాస్తిక కేంద్రం నిర్వాహకులైన డాక్టర్ జి.సమరం ముందు మాట రాశారు. 'హేతువాదం అంటేనే ప్రశ్నించడం, పరిశీలించడం, పరీక్షించడం, ఆపైన సత్యాన్ని రాబట్టడం, దానిని అనుసరించడం. అంతేకానీ అస్తికత్వంలోలా గుడ్డిగా నమ్మడం, అనుసరించడం కాదు' అని చెబుతారు. వృత్తిరీత్యా అధ్యాపకుడైన రచయిత జె.వి.కృష్ణయ్య ప్రశ్న సంధించడం, సమాధానం రాబట్టడం, సమాధానం సరైనది కాకపోతే సరిదిద్దడం, ఆపైన ఆ సమాధానం ఎందుకు సరికాదో, తాను చెప్పింది ఎలా సబబో వివరించడం ఆ పుస్తకం మొత్తంగా కనిపిస్తుంది. అందుకే రచయిత ఈ పుస్తకం ప్రారంభంలోనే హేతువాదం అంటే 'శాస్త్రీయ ఆలోచనా విధానం', 'సక్రమమైన మానసిక వైఖరి' అని నిర్వచించారు. అంతేకాకుండా హేతువాదం ఒక నిర్మాణాత్మక జీవన విధానం అని కూడా చెప్పుకొచ్చారు. హేతువాదం గురించి ఏమాత్రం సందిగ్ధత లేకుండా ప్రశ్నించడం అని కూడా పేర్కొన్నారు. ఈ ప్రశ్నించే విధానం వివిధ రూపాల్లో ఈ పుస్తకంలో వివరంగా రాశారు. హేతువాదం ముఖ్య ఉద్దేశ్యాలను స్పష్టంగా, సవివరంగా పొందు పరిచారు. ఈ పుస్తకం తన అనుభవాలు, ఇతరుల పరిశీలన, వివిధ సంఘటనల నుంచి నిజాలను వెల్లడించడం, అబద్ధాలను బట్టబయలు చేయడం సామాన్య పాఠకునికి హేతువాదం గురించి ఎంతో ఆసక్తిని కలిగించేలా రాశారు. అలాగే ఈ పుస్తకాన్ని చదివిన ప్రముఖ రచయిత డాక్టర్ కత్తి పద్మారావు కూడా తన అభిప్రాయాన్ని ఇందులో పొందుపరిచారు. రచయిత జె.వి. కృష్ణయ్యను ఆయన హేతువాద, లౌకిక వాద, సామ్యవాద, భావజాలం గల మేధావిగా వర్ణించారు. ఉమ్మడి జిల్లాలోని గోస్పాడు మండల కేంద్రంలో 1957 మే 14న జన్మించిన రచయిత జె.వి. కృష్ణయ్య ఎం.ఎడ్, బీఎల్ పూర్తి చేశారు. ఏపీఆర్‌జేసీ కళాశాల అధ్యాపకునిగా పనిచేస్తూ ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొంది పదవీ విరమణ చేశారు. ప్రవృత్తి పరంగా మూఢ, అంధ విశ్వాసాలను రూపుమాపేందుకు కృషి చేస్తున్నారు. హేతువాద, నాస్తిక వాద భావజాలంతో సమకాలీన సామాజిక సమస్యలపై భావస్వారూప్య సంఘాలతో కలిసి పనిచేస్తున్నారు. ప్రస్తుతం మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా కొనసాగుతున్నారు.

- ఎస్సార్. మందిరాజు, కర్నూలు

చివరి ఆయకట్టుకు నీరు అందేలా చర్యలు

(5వ పేజీ తరువాయి)

సముద్రంలోకి వృథాగా పోతున్న నీటిని బనకచర్ల ప్రాజెక్టు ద్వారా రాయల సీమకు తీసుకరావడానికి ప్రయత్నిస్తుంటే రాజకీయం కోసం విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. తెలంగాణ రాజకీయ నాయకులు చేస్తున్న విమర్శలపై వైసీపీ నాయకులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. త్వరలో బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్రమంత్రిని కలిసి ప్రాజెక్టు ఆవశ్యకతను తెలియజేస్తామన్నారు. గోరుకల్లు రిజర్వాయర్ కట్టలు ఎప్పటికప్పుడు తెగుతున్న క్రమంలో శాస్వత పరిష్కారం కోసం ముఖ్యమంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్తామన్నారు. ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేల మంతా గుండ్రేవుల ప్రాజెక్టు కోసం తీర్మానం చేసి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు.

ఐఈబీ సమావేశంలో తీర్మానాలివీ..

- కృష్ణా జలాల పంపిణీ ట్రిబ్యునల్ ప్రకారం కేటాయించిన 31.90 టీఎంసీల నీటిని నిల్వ చేసేందుకు తగిన జలాశయం లేకపోవడంతో 2019లో శంకుస్థాపన చేసిన గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వంతో చర్చించాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ప్రతిపాదించారు.
- తెలుగుగంగ పథకం, కేసీ కాలువ కింద రైతాంగం సాగునీటి అవసరాల దృష్ట్యా 2026 జనవరి 31 వరకు 12 టీఎంసీల నీటిని వెలుగోడు జలాశయంలో నిల్వ చేయాలని తీర్మానించారు.
- అలగనూరు జలాశయ మరమ్మతులకు తక్షణమే అనుమతులు మంజూరు చేయాలని, రాబోయే బడ్జెట్‌లో నిధులను కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు.
- కేసీ కాలువకు 13వ తేదీ నుంచి, తెలుగుగంగ కాలువకు 12వ తేదీ అర్ధరాత్రి నుంచి, ఎస్సార్బీసీ కాలువకు 12వతేదీ అర్ధరాత్రి నుంచి, హంద్రీ నీవా కాలువకు 15వ తేదీ నుంచి నీటిని విడుదల చేయాలని తీర్మానించారు.

మధుర సాహితీమూర్తి ఎలమర్తి

- తెలుగు సాహితీ క్షేత్రంలో అక్షర కృషీవలుడు
- జిల్లాలో మధుర కవిగా ప్రత్యేక గుర్తింపు
- 45 ఏళ్లుగా సాహిత్య ప్రస్థానం
- ఎస్పీ బాలుతో ప్రశంసలు


రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ చేతుల మీదుగా సత్కారం అందుకుంటూ..


ఎలమర్తి రమణయ్య

కర్నూలు కల్చరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వృత్తి రీత్యా ఉపాధ్యాయుడిగా పదవీ విరమణ చేసినా, ప్రవృత్తి రీత్యా సాహితీ రంగానికి విరమణ లేదని చాటి చెబుతున్నారు ఈ మధుర కవి. సుసంపన్నమైన తెలుగు భాషకు పట్టం కడుతూ 45 ఏళ్లుగా సాహిత్య ప్రస్థానం సాగిస్తున్నారు కర్నూలుకు చెందిన ఎలమర్తి రమణయ్య. 'మధుర కవి' పేరుతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆయన తెలుగు సాహితీక్షేత్రంలో అక్షర కృషీవలుడిగా రాణిస్తున్నారు. 'సీమ సింహద్వారా.. శ్రీశైల ముఖద్వారం..' అంటూ కందన వోలుపై ఆయన రాసిన గీతిక గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం స్వరం నుంచి జాలువారి ప్రేక్షక నీరాజనాలు అందుకుంది. అదీ కందనవోలులో జరిగిన ఒక కార్యక్రమంలోనే కావడం విశేషం. 'రాయలు ఏలిన సీమ.. ఇది రతనాల సీమ' అనే మరో పాట సినీ సంగీత దర్శకుడు, గాయకుడు వందేమాతరం శ్రీనివాస్ గొతుల్లో ఒదిగిపోయి, మాతృగడ్డ మమకారాన్ని చాటి చెప్పింది. కథ, కథానిక, కవిత, పాట, పద్యం, వ్యాసం ఏ సాహితీ ప్రక్రియ అయినా ఆయన కలంలో భావ వీచికలతో అలరిస్తుంది. అంతేకాదు, తెలుగు భాషా వికాస ఉద్యమంలో చురుకైన పాత్ర పోషిస్తూ భాషా పరిరక్షణకు తనదైన ఉద్యమ ప్రస్థానం కూడా సాగిస్తున్నారు.

తండ్రి స్ఫూర్తితో కళా, సాహిత్యంలో రాణింపు

ఎలమర్తి రమణయ్య 1956 జూలై 1వ తేదీన జన్మించారు. తల్లిదండ్రులు దివంగత అయ్యమ్మ, వై. నాగభూషణం. తండ్రి ప్రముఖ హార్మోనిస్టు, ఫ్లూట్ ఆర్టిస్టు. ఆయనది నందికొట్కూరు ప్రాంతం. అయినా 50వ దశకంలో అనేక నాటకాలకు హార్మోనిస్టుగా పనిచేస్తూ ఆనాటి ప్రఖ్యాత నాటక రంగ మహామహులు గూడూరు సావిత్రి, సురభి బాలసరస్వతి, బుర్రా సుబ్రహ్మణ్యం, ఆచంట వెంకటరత్నం నాయుడు, ఈలపాటి రఘురామయ్య వంటి వారితోపాటూ జిల్లాలోని వెల్దుర్తి వెంకటనర్సు నాయుడు తదితర కళాకారులతో నాటకాలు వేయించేవారు. అలా తండ్రి నాటక పద్యాలకు రాగాలను కూర్చి పాడిస్తుంటే అవి వింటూ పెరిగాడు. తండ్రి వెంట తిరుగుతూ నాటకం, సాహిత్యంపై ఎల్లమర్తి మమకారం పెంచుకున్నారు. తండ్రి మరణంతో వాటికి దూరం కావాల్సి వచ్చింది. తల్లి ప్రోత్సాహంతో చదువుపై ఆసక్తితో ముందుకు పోయారు. అలా బీఏ, బీఎడ్ పూర్తి చేశారు. 1978 నుంచి 1989 వరకు రాయలసీమ పేపర్ మిల్లులో ఆఫీస్ అసిస్టెంట్‌గా, అనంతరం బిజినెస్ మేనేజర్‌గా పనిచేశారు.

ఆకాశవాణి కార్యక్రమాలు..

అప్పట్లో కడప ఆకాశవాణి కేంద్రం వారు కార్మికుల కార్యక్రమం నిర్వహిస్తూ కార్మికులకు సంబంధించిన అనేక విషయాలను ఆసక్తిగా తెలియజేసేవారు. పేపర్ మిల్లులో పనిచేస్తూ ఎలమర్తి అనేక వ్యాసాలు రాసి వాటి ద్వారా ప్రశంసలు అందుకున్నారు. ఆకాశవాణి అధికారులు స్వయంగా మాట్లాడిస్తూ ఈ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రోత్సాహం అందించారు. అదే స్ఫూర్తితో అనేక కథలు, కథానికలు, నాటకాలు రాసి వాటి ప్రసారం ద్వారా ప్రశంసలు అందుకున్నారు.

మలుపుతిప్పిన ఉపాధ్యాయ జీవితం..

పేపర్ మిల్లు కొన్నికారణాలతో 1989లో మూతపడ్డాక మళ్లీ కొత్త జీవితాన్ని వెతుక్కోవలసి వచ్చింది. అలా ఒక ప్రైవేటు పాఠశాల్లో పనిచేస్తూనే డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. 1990లో మున్సిపల్ హైస్కూల్ బండిమెట్టలో తన ఉపాధ్యాయ జీవితాన్ని ప్రారంభించారు. భావి పౌరులను తీర్చిదిద్దే బాధ్యతను నిర్వర్తిస్తూనే తన కలానికి పదును పెట్టారు. మాతృభాషపై మమకారం తరిగిపోతున్న నేటికాలంలో ఆయన ఇరవై ఏళ్ల క్రితమే ఉద్యమం చేపట్టారు. తెలుగు భాషా వికాస ఉద్యమం సంస్థలో చేరి జిల్లా వ్యాప్తంగా అనేక కార్యక్రమాలు చేపట్టారు. 'కమ్మనైన తెలుగు భాష కలనైనా మరువద్దు.. అమ్మపాల కమ్మదనం, మాతృభాష మరువద్దు' అనే ఉద్యమ గీతంతో రాష్ట్ర వ్యాప్తంగా పేరుతెచ్చుకున్నారు. తెలుగు భాష పునరుజ్జీవానికి ఉద్యమ గీతాలు రాస్తున్నారు. జేవీవీలో పనిచేస్తూ అనేక ఉద్యమ గీతాలు రాసి రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్నారు.





ఎలమర్తి రాసిన పుస్తకాలు

రచనలు ఎన్నో.. పురస్కారాలు మరెన్నో


రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా పురస్కారం అందుకుంటూ..

మధుర కవి ఎలమర్తి అనేక పుస్తకాలు రాశారు. తెలుగు భాషను సుసం పన్నం చేస్తూ అనేక పద్యగీతాలు రాశారు. కర్నూలు ప్రశస్తి, కర్నూలు వైభవం, తామ్రధ్వజ విజయం, పర్యావరణ గీతావళి, పొదుపు లక్ష్మి కళా జాత (పద్యాలు), అక్షర వీక్షణం, ప్రతి చోటా నా పాట, లవకుశ చిత్ర పాటలపై సమీక్ష (పుస్తకం), పుష్కర కృష్ణవేణి, శివస్తుతి (కంద పద్యాలు) వంటివి రాశారు. అలాగే ఎస్పీ బాలు కర్నూలులో నిర్వహించిన 'పాడాలని ఉంది' కార్యక్రమానికి కర్నూలు వైభవంపై గీతం రాసి అందించి, ఆయనతో ప్రశంసలు అందుకున్నారు. రాయలసీమ విశ్వవిద్యాలయం, క్లస్టర్ యూనివర్సిటీలకు గీతాలు అందించారు. రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం 2007లో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా అందుకున్నారు. 2008లో ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డితో, 2017లో ఎన్టీఆర్ ట్రస్టుతో, టీడీపీ నేత చంద్రబాబుతో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు.

పౌరాణికంలో ప్రతిభ

- పద్యాలతో అలరిస్తున్న మంత్రాలయం సుంకప్ప
- దుర్యోధనుడు, శ్రీకృష్ణుడు, వీరబాహుడు వంటి పాత్రల్లో రాణింపు
- పలువురి నుంచి ప్రశంసలు


దుర్యోధన వేషాధారణలో సుంకప్ప



మంత్రాలయం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో నాటక ప్రదర్శనల్లో పేరుగాంచిన సుంకప్ప పద్యం పాడితే వీక్షకులు ఈలలు, కేకలు వేయాల్సిందే. మంత్రాలయం పరిసర ప్రాంతాల్లో దుర్యోధనుడి పాత్రలో మెప్పించాలంటే వెంటనే గుర్తుకువచ్చే కళాకారుల్లో సుంకప్ప ప్రథముడు. 57 ఏళ్ల వయసులోనూ ఎన్నో పౌరాణిక నాట ప్రదర్శనలు ఇస్తూ ఔరా అనిపించుకుంటున్నాడు. 18 ఏళ్ల వయసులోనే బైలు ఆట, లీలావతి, రుక్మిణి అనే కన్నడ నాటక ప్రదర్శనతో ప్రవేశించి సామాజిక రక్త తిలకంలో హాస్యనటుడుగా నటనలో అందరి మన్ననలు పొందాడు. దుర్యోధనుడిగా మయసభ, పడకసీనులో తన బాణితో విశ్వరూపం ప్రదర్శించి ప్రశంసలు పొందాడు. సత్యహరిశ్చంద్రలో వీరబాహుడు, శ్రీకృష్ణ తులాభారంలో కృష్ణుడు, వీరబ్రహ్మంగారి చరిత్రలో పీర్‌సాబ్, కక్కయ్య వంటి పాత్రలను అవలీలగా పోషిస్తూ తన నటనకు తిరుగులేదని నిరూపించుకుంటున్నాడు. ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో సామాజిక, పౌరాణిక, కన్నడ భాషాల్లో రాణిస్తూ నటసామ్రాట్‌గా నిలిచాడు. రాఘవేంద్రస్వామి ఉత్సవాల్లో తన సొంత ఖర్చులతో పౌరాణికాన్ని మేలుకొలిపే విధంగా శ్రీగురు రాఘవేంద్ర నాటక కళాసమితిని ఏర్పాటు చేసి కోశాధికారిగా కొనసాగుతున్నాడు. ఈయనకు భార్య మంగమ్మ, ముగ్గురు కొడుకులు, కూతురు ఉన్నారు. సాధారణ రైతు కూలీ కుటుంబంలో జన్మించి టెంకాయల వ్యాపారం, ట్యాక్సీ నడుపుతూ, లాడ్జీల నిర్వహణ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పౌరాణిక నాటకాలు ఎక్కడ ప్రదర్శనలు ఉంటే అక్కడ ఆయన ప్రత్యక్షమవుతాడు. కనుమరుగవుతున్న పౌరాణిక నాటకాలకు జీవం పోసేందుకు తన సొంత ఖర్చుతో సంగీతం మాస్టార్లను పోషిస్తూ తోటి కళాకారులకు సహకారాలు అందిస్తూ ముందుకు వెళ్తున్నాడు. మంత్రాలయం పూర్వ పీఠాధిపతులు సుశమీంద్రతీర్థులు, సుయతీంద్రతీర్థులు, ఇప్పటి పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులతో పాటు డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి, ప్రముఖ పౌరాణిక కళాకారిణి రత్నశ్రీతో అభినందనలు పొందారు.

కళాకారులకు ప్రభుత్వం ప్రోత్సాహం ఇవ్వాలి

కనుమరుగువతున్న పౌరాణిక నాటకాలకు ప్రభుత్వం ప్రోత్సహించి గుర్తింపు కార్డులు ఇవ్వాలి. కళాకారులకు పింఛన్లు, ఇంటి స్థలాలు, కళాప్రాంగణాలు నిర్మించి భారతదేశ సంస్కృతి సంప్రదాయ ధర్మాలతో నిర్మిస్తున్న పౌరాణిక నాటకాలకు ప్రభుత్వం తోడ్పాటు అందించాలన్నారు.

సుంకప్ప, మంత్రాలయం


సామాజిక నాటిక ప్రదర్శనలో ఓ సన్నివేశంలో సుంకప్ప

రాయచూరు టు తిరుపతి

- పర్యావరణ పరిరక్షణ కోసం..
- కర్ణాటక వాసుల సైకిల్ యాత్ర


ఆదోనికి చేరుకున్న కర్ణాటక సైకిల్ యాత్రికులు

ఆదోని రూరల్, జూలై 12 ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం రాయచూరుకు చెందిన రాజు, తిమ్మారెడ్డి, సునాల్ రాయచూరు నుంచి తిరుపతికి సైకిల్ యాత్ర చేపట్టారు. శనివారం మధ్యాహ్నం ఆస్పరి బైపాస్‌లో మారెమ్మవ్వ దేవాలయం వద్ద సైకిల్ యాత్రికులు సేదతీరారు. ఉదయం 5గంటలకు రాయచూరులో బయల్దేరామని, 14వ తేదీన సాయంత్రానికి తిరుపతికి చేరుకుంటామని వారు తెలిపారు. ప్రతి ఏటా వర్షాకాలం ఆ రంభంలో రాయచూరు నుంచి తిరుపతికి సైకిల్‌పై వెళ్తామన్నారు. రోడ్డుకిరువైపులా చాలా ప్రాంతాల్లో పలురకాల మొక్కలను నాటుతామన్నారు. 12 సంవత్సరాలుగా తిరుపతికి సైకిల్‌లో వెళ్తున్నామన్నారు. 12ఏళ్ల క్రితం నాటిన చెట్లు ఇప్పుడు పెద్దవిగా అయ్యాయయని, వాటిని చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉందన్నారు.

మొదటి సారి..



మొదటి సారి సైకిల్‌పై అందరితో పాటు తిరుపతికి వెళ్తున్నా. ఎంతో ఆనందంగా ఉంది. సమయం కూడా కనిపించడం లేదు. రాయచూరులో కూడా కాలుష్య నివారణ కోసం ఎన్నో కార్యక్రమాలను చేపట్టాను.

- సునీల్, రాయచూరు

12 ఏళ్ల క్రితం...



పన్నెండు సంవత్సరాల క్రితం రాయచూరు నుంచి తిరుపతికి సైకిల్ యాత్ర ప్రారంభించా. కొత్తవాళ్లను కూడా సైకిల్ యాత్రకు ప్రోత్సహిస్తున్నా. అప్పుడు నాటిన మొక్కలు నేడు చెట్లు అయ్యాయి. వాటిని చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉంది.

- రాజు, రాయచూరు

సైకిల్ తొక్కడంతో..



11 సంవత్సరాలుగా తిరుపతికి సైకిల్‌పై వెళ్తున్నా. నా వయస్సు 45 సంవత్సరాలు. సైకిల్ తొక్కడంతో ఎంతో ఆరోగ్యంగా ఉన్నా. అత్యావసర పరిస్థితుల్లో తప్ప వాహనాలను ఉపయోగించను.

- తిమ్మారెడ్డి, రాయచూరు

తెలుగు భాషకు పూర్వవైభవం తీసుకువద్దాం

- విశ్రాంత ఐఏఎస్ అధికారి నందివెలుగు ముక్తేశ్వరరావు
- ఘనంగా రాష్ట్ర తెలుగు భాషా పరిరక్షణ సదస్సు ప్రారంభం
- నగరంలో భారీ ర్యాలీ
- వివిధ జిల్లాల నుంచి హాజరైన ప్రతినిధులు


విశ్రాంత ఐఏఎస్ అధికారి ముక్తేశ్వరరావు రాసిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

కర్నూలు కల్చరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషకు పూర్వవైభవం తీసుకువద్దామని విశ్రాంత ఐఏఎస్ అధికారి నంది వెలుగు ముక్తేశ్వరరావు పేర్కొన్నారు. అధికార భాషగా, బోధనా భాషగా తెలుగును అమలు చేయడంతోపాటూ ప్రథమ భాషగా, మాతృభాషగా తగిన గుర్తింపు ఇవ్వాలని కోరుతూ రెండు రోజుల రాష్ట్రస్థాయి తెలుగు భాషా పరిరక్షణ సదస్సు శనివారం కర్నూలులో ఘనంగా ఆరంభమైంది. కొండారెడ్డి బురుజు సమీపంలోని తెలుగు తల్లి విగ్రహం వద్ద భాషాభిమానులు, సాహితీవేత్తలు, వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన సదస్సు ప్రతినిధులు, విద్యార్థులు తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. తెలుగు భాషను పరిరక్షించాలంటూ ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. తెలుగు తల్లి విగ్రహం నుంచి కిడ్స్ వరల్డ్, రాజ్‌విహార్ సర్కిల్, బుధవారపేట మీదుగా కలెక్టరేట్ ముందు గల మాజీ సీఎం ఎన్టీఆర్ విగ్రహం వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ముక్తేశ్వరరావు రచించిన 'అప్పుడు రాష్ట్రం కోసం...ఇప్పుడు భాష కోసం' అనే పుస్తకాన్ని సాహితీవేత్తలు ఆవిష్కరించారు. సదస్సు కార్యదర్శి డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి స్వాగతోపన్యాసంతో ప్రారంభమైన ఈ సదస్సులో మద్రాసు తెలుగు సంఘం అధ్యక్షుడు తూమాటి సంజీవరావు, నరసం జిల్లా అధ్యక్షురాలు కా.వెం.సుబ్బలక్ష్మమ్మ, డీఎస్పీ మహబూబ్ బాషా, ఎం. లక్ష్మయ్య ప్రసంగించారు. తొలిరోజు సదస్సు రెండో సెషన్‌లో వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన తెలుగు భాషా ప్రతినిధులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. తెలుగు భాషా పరిరక్షణ, ఉన్నతి, అమలు తదితర అంశాలపై తగిన సూచనలు చేశారు. ఈ అంశాలపై ఆదివారం జరిగే ముగింపు సదస్సులో మరోసారి చర్చించి, తీర్మానాలు చేసి కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదించాలని సదస్సు బాధ్యులు నిర్ణయించారు. అంతకు ముందు సునీత వ్యాఖ్యానంతో నృత్య గురువు కరీముల్లా శిష్య బృందం ప్రదర్శించిన నృత్య రూపకాలు, ఎలమర్తి రమణయ్య, జేఎస్ఆర్‌కే శర్మ, కళారత్న పత్తి ఓబులయ్య, గాయని సుజాత ఆలపించిన తెలుగు పద్యాలు, పాటలు ఆకట్టుకున్నాయి.


తెలుగు తల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న పత్తి ఓబులయ్య తదితరులు

రేపటి తరాలకు అందించాలి..

తెలుగు గొప్పదనాన్ని రేపటి తరాలకు అందించాల్సిన బాధ్యత నేటి తల్లిదండ్రులు, సాహితీవేత్తలు, ఉపాధ్యాయులపై ఉందని విశ్రాంత ఐఏఎస్ అధికారి నందివెలుగు ముక్తేశ్వరరావు అన్నారు. గతమెంతో ఘనకీర్తి ఉన్న తెలుగు భాషను నేడు నిర్లక్ష్యం చేస్తున్నారని, మాతృభాషలో బోధన సాగితే మంచి ఫలితాలు ఉంటాయని చెప్పారు. ఈ సదస్సులో తెలుగు భాషను ఎలా కాపాడుకోవాలనే అంశంపై చర్చలు చేసి తీర్మానాలను ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు.

చారిత్రక సదస్సులు నిలిచిపోవాలి : కేసీ కల్కూర

సభకు అధ్యక్షత వహించిన సదస్సు అధ్యక్షుడు కేసీ కల్కూర మాట్లాడుతూ రెండు రోజుల పాటూ కొనసాగే ఈ సదస్సు ఒక చారిత్రక సదస్సులా నిలిచిపోవాలని ఆకాంక్షించారు. నాడు పొట్టి శ్రీరాములు త్యాగంతో భాషా ప్రయుక్త రాష్ట్రాల ప్రాతిపదికన ఆంధ్రరాష్ట్రం ఏర్పడితే, అయితే 70 ఏళ్ల గడుస్తున్నా తెలుగు అధికారిక భాషగా లేకపోవడం బాధాకరమని చెప్పారు.

చింతామణి నాటకంపై నిషేధం ఎత్తివేయాలి : పత్తి ఓబులయ్య

కాళ్లకూరి నారాయణ రావు వందేళ్ల క్రితం రాసిన 'చింతామణి' నాటకాన్ని గత ప్రభుత్వం నిషేధించిందని, ఆ నిషేధాన్ని ఎత్తివేసేలా ప్రభుత్వం చూడాలని మరో అతిథి, కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య కోరారు. ప్రభుత్వం తెలుగు అకాడమీని పునఃప్రారంభించాలని, అధికార భాషా సంఘం ఏర్పాటు చేసి తెలుగు భాషకు పూర్వ వైభవం తీసుకురావాలన్నారు. ఎవరో కొందరు వాస్తవ కథను పక్కదారి పట్టించడం వల్ల ఒక వర్గానికి ఇబ్బంది కలిగిందని, రచయిత రాసిన విధంగా పుస్తకాన్ని యథావిధిగా ప్రదర్శిస్తే ఎవరికీ ఏ ఇబ్బంది ఉండబోదని చెప్పారు.

తెలుగు భాషకు జీవం పోస్తూ.. జేఎస్ఆర్‌కే శర్మ

మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ తెలుగు భాషకు జీవం పోస్తూ అనేక సంస్కరణలు చేశారని సదస్సు ఉపాధ్యక్షుడు జేఎస్ఆర్‌కే శర్మ మాట్లాడుతూ గుర్తు చేశారు. నేడు తెలుగు భాషకు పూర్వవైభవాన్ని కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు.

విజేత అనంత

ముగిసిన మల్టీ డే క్రికెట్ పోటీలు


కమిల్

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మల్టీ డే క్రికెట్ పోటీల్లో కర్నూలు జట్టుపై అనంతపురం జట్టు గెలుపొందింది. నాలుగో రౌండ్ సీనియర్ మల్టీ డే క్రికెట్ పోటీలు స్థానిక అనంత క్రీడాగ్రామంలో శనివారం ముగిశాయి. అనంతపురం, కర్నూలు జట్ల మధ్య పోటీ జరిగింది. మొదటి ఇన్నింగ్స్‌లో అనంతపురం 267 పరుగులకు ఆలౌట్ కాగా కర్నూలు 178పరుగులకే కుప్పకూలింది. 89 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు 204 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం 293 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన కర్నూలు 255 పరుగులకు ఆలౌట్ అయ్యి పరాజయం పాలైంది. అనంతపురానికి బౌలర్ కమిల్ 7 వికెట్లు పడగొట్టాడు. జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రకాష్‌రెడ్డి, భీమలింగారెడ్డి విజేత జట్టును అభినందించారు.





రాజసౌధం నమూనాలో శిలా తోరణం,

ఆహ్లాదవనం



ఏనుగు ఆకృతిలో జారుడు బల్ల

- మైమరిపించే జీవాకృతులు
- రాజసౌధం రూపంలో తోరణం
- మానసిక ఉపశమనం కోసం యోగా కేంద్రం
- మెరుగైన వసతులతో ఆధునికీకరణ

సహజసిద్ధమైన ప్రకృతి ఒడిలో ఆహ్లాదాన్ని పంచేలా పచ్చని చెట్లు, పచ్చిక మైదానాలు, సందర్శకులు మైమరిపించేలా ఆకర్షణీయమైన జీవాకృతులు, చిన్నారులను మురిపించేలా జంతు బొమ్మలతో ఆట వస్తువుల ఏర్పాటుతో 'విజయవనం' చూడముచ్చటగా ఏర్పాటైంది. నగర శివారు వెంగన్నబావి సమీపంలోని హంద్రీ నది పరివాహక ప్రాంతంలో దాదాపు 85ఎకరాల్లో విస్తరించింది. ఈ ప్రాంతం ఇటీవలి కాలంలో మెరుగైన వసతులతో ఆధునికీకరించబడింది. సందర్శకులకు ఆహ్వానం పలికేందుకు రాజసౌధం రూపంలో శిలా తోరణం, విభిన్న జీవాకృతులు ఉట్టిపడేలా శిలలపై శిల్పాలు, మానసిక ఉపశమనం కోసం యోగా కేంద్రం తదితర వాటిని తీర్చిదిద్దారు. కొంత కాలంగా ఈ ప్రాంతంలో సందర్శకుల తాకిడి అధికమైంది. అధిక విస్తీర్ణంలో ఈ ప్రాంతం కొలువు తీరటంతో దీనిని మరింత వినూత్నంగా తీర్చిదిద్దితే భవిష్యత్తులో విజయవనం పర్యాటక కేంద్రంగాను అభివృద్ధి చెందే అవకాశం ఉందని నగరవాసులు భావిస్తున్నారు.



రహదారికి ఇరువైపుల చెట్లు

- కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, ఆంధ్రజ్యోతి



మధ్యంతర భృతి ప్రకటించాలి : పీఆర్‌టీయూ

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎన్వీ కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. కర్నూలు నగరం బిర్లా కాంపౌండులోని పీఆర్‌టీయూ కార్యాలయంలో శనివారం ఎన్వీ కృష్ణారెడ్డి అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ పీఆర్సీ బకాయిలు, పెండింగ్ డీఏలు వెంటనే చెల్లించాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని, పదో న్నతి, బదిలీలలో నూతన పాఠశాలలో జాయిన్ అయిన ఉపాధ్యాయుల వేతనాల చెల్లింపులో జాప్యం లేకుండా చూడాలన్నారు. ఉపాధ్యాయుల హాజరు 9.15 గంటల వరకు వేసేలా అవకాశం ఇవ్వాలని కోరారు. విద్యార్థుల హాజరు నమోదుకు 9.30కి గంటలకు బదులుగా 10గంటల వరకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పీఆర్‌టీయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రవిప్రకాష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీరారెడ్డి, ఆదినారాయణరెడ్డి, సుదర్శన్, మణి కుమార్, శ్రీనివాసరెడ్డి, నాగేశ్వరయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎన్వీ కృష్ణారెడ్డి

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ఆదోని, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఆదోని-కుప్పగల్ రైల్వేస్టేషన్ల మధ్య ఓ గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు రైల్వే ఎస్ఐ గోపాల్ తెలిపారు. ఆదోని సమీపంలోని గ్రామానికి చెందిన వ్యక్తి అయ్యి ఉంటాడని, 40 నుంచి 45 యేళ్ల మధ్య వయస్సు ఉంటుందని తెలిపారు. ఆధారాలు దొరక్కపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

బనగానపల్లె, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బత్తులూరుపాడు గ్రామానికి చెందిన సంజీవరెడ్డి(53) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నారు. బనగానపల్లె పోలీసులు శనివారం తెలిపిన వివరాలివీ.. బత్తులూరుపాడు గ్రామానికి చెందిన సంజీవరెడ్డి బనగానపల్లెలో ట్యూషన్ నిర్వహిస్తూ మరో వైపు వ్యవసాయం చేస్తూ జీవించేవారు. బత్తులూరుపాడు గ్రామంలో 6 ఎకరాలు కౌలుకు తీసుకొని గత ఏడాది మిరప సాగు పూర్తిగా నష్టపోయారు. రూ.10 లక్షలు అప్పు ఉంది. ఈ అప్పు ఎలా తీర్చాలోనన్న మనస్తాపంతో పట్టణ శివారులోని నంద్యాల రహదారిలో ఓ పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. సంజీవరెడ్డి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఆయన భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మధుకుమార్ (ఫైల్)

డోన్ టౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన మధుకుమార్ (21) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వివరాలివీ.. శనివారం డోన్ రూరల్ ఎస్ఐ మమత తెలిపిన వివరాలివీ.. మధుకుమార్ డోన్‌లోని ఓ బైక్ మెకానిక్ షాపులో పని చేస్తుండేవాడు. మధుకుమార్ సోదరిని చూసేందుకు ఆయన బావతో కలిసి బైక్‌పై బేతంచెర్ల మండలంలోని ఆర్ఎస్ రంగాపురానికి బయలుదేరారు. చిన్నమల్కాపురం రైల్వేస్టేషన్ వద్ద వీరు వెళ్తున్న బైకు, ట్రాక్టర్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మధుకుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. మహేష్ గాయపడ్డాడు. యువకుడి బావ మహేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కాటసాని ఓబుళరెడ్డి పై కేసు నమోదు

- డోన్ డీఎస్పీ శ్రీనివాసులు



బనగానపల్లె, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కుమారుడు కాటసాని ఓబుళరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు డోన్ డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. శనివారం పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ పార్టీ విస్తృత సమావేశంలో కాటసాని ఓబుళరెడ్డి తన ప్రసంగంలో సభ్య సమాజం తలవంచుకునేలా మాట్లాడారన్నారు. బాబుష్యూరిటీ, భవిష్యత్ గ్యారెంటీ పథకానికి వ్యతిరేకంగా ఓ సమావేశం నిర్వహించారన్నారు. ఈసమావేశంలో ఓబుళరెడ్డి రెచ్చగొట్టే విధంగా మాట్లాడారన్నారు. ప్రజాస్వామ్యంగా ఒక పదవిలో ఉన్నప్పుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, రెచ్చగొట్టేలా మాట్లాడటం తగదన్నారు. సీఐ ప్రవీణ్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

వెల్దుర్తి, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ అధికారులను ఆదేశించారు. శనివారం గ్రామపంచాయతీ పరిధిలో 3,4, 10 వార్డుల్లో పర్యటించారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు. గ్రామంలోని పార్వతయ్య వంక వద్ద ఉన్న సంపును పరిశీలించారు. నక్కలదిబ్బ చెత్తసంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి, ఉపయోగంలోకి తీసుకురావాలని సూచించారు. డిప్యూటీ ఎంపీడీఓ రవికిశోర్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనాథ్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో చర్చిస్తున్న డీపీవో భాస్కర్

పుణ్యస్నానాలకు వెళ్లి..



గల్లంతుకు ముందు.. సెల్ఫీ తీసుకుంటున్న యువకులు



అజిత్, సచిన్, ప్రమోద్ (ఫైల్)

- తుంగభద్ర నదిలో ముగ్గురు గల్లంతు
- ప్రాణాలతో బయటపడిన నలుగురు
- వీరంతా డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులే
- వీఐపీ స్నాన ఘట్టం సమీపంలో ఘటన
- ముమ్మరంగా గాలింపు చర్యలు
- శోకసంద్రంగా నదీతీరం

ఒకే కళాశాలలో ఏడుగురు యువకులు డిగ్రీ చదువుతున్నారు. రాఘవేంద్ర స్వామిని దర్శించుకునేందుకు పవిత్ర పుణ్యక్షేత్రమైన మంత్రాలయానికి రావాలని అనుకున్నారు. శనివారం ఉదయమే ఇక్కడికి స్వామివారి దర్శనార్థం వచ్చారు. స్వామిని దర్శించుకొని, సాయంత్రం పుణ్యస్నానాలు ఆచరించేందుకు తుంగభద్ర నదీతీరానికి చేరుకున్నారు. స్నేహితులంతా కలిసి నదిలోకి వెళ్లారు. ఒక్కసారిగా వరద ప్రవాహం ఉధృతమైంది. ఇంతలో వారిలో ముగ్గురు మిత్రులు నదిలో నీటి ప్రవాహానికి కొట్టుకుపోయారు. మరో నలుగురు ఎలాగోలా ప్రాణాలతో ఒడ్డుకు చేరారు. ప్రాణస్నేహితులు నదిలో గల్లంతు కావడంతో వీరు కన్నీరు మున్నీరయ్యారు. ఈ ఘటనతో తుంగభద్ర తీరం శోకసంద్రంగా మారింది.

మంత్రాలయం, జూలై 12(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన యువకులు పుణ్యస్నానాల కోసం తుంగభద్ర నదిలోకి వెళ్లారు. ముగ్గురు గల్లంతు కాగా మరో నలుగురు యువకులు ప్రాణాలతో బయటపడ్డారు. ఈఘటన మఠం సమీపంలో వీఐపీ స్నానఘట్టం సమీపంలో చోటుచేసుకున్నట్లు ఎస్ఐ శివాంజల్ తెలిపారు. వివరాలు.. కర్ణాటకలోని హాసన్ జిల్లా అర్సికెరే మండలం జావగల్ గ్రామానికి చెందిన ఏడుగురు స్నేహితులు శనివారం మంత్రాలయం వచ్చారు. ఉదయం రాఘవేంద్రస్వామిని దర్శించుకున్నారు. సాయంత్రం పుణ్యస్నానాలు చేయడానికి తుంగభద్ర నదిలోకి వెళ్లారు. అజిత్(19), సచిన్(20), ప్రమోద్(19) స్నానం చేస్తుండగా నీటి ప్రవాహంలో గల్లంతయ్యారు. హేమంత్, నారాయణ, రంగనాథ్, దర్శన్ ప్రాణాలతో బయటపడ్డారు. బయట పడిన యువకులు కేకలు వేయడంతో అక్కడి తోటి భక్తులు వచ్చి చూసేలోపు నదిలో కనిపించకుండా గల్లంతయ్యారు. యువకులంతా డిగ్రీ విద్యార్థులు. వీరిలో ప్రమోద్ ఒక్కడే ఒక బేకరిలో ఉద్యోగం చేస్తున్నాడు. విషయం తెలుసుకున్న వెంటనే ఎస్ఐ శివాంజల్, సర్పంచ్ భీమయ్య, మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ అనంతపురా జిక్ ఘటనాస్థలికి చేరుకున్నారు. పుట్టీల సాయంతో గజ ఈతగాళ్లతో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. అదే సమయంలో వర్షం పడటంతో గాలింపునకు అంతరాయం కలిగింది. అనంతరం గాలింపు చర్యలు చేపట్టినా చీకటి పడటంతో నిలిపివేశారు. రాత్రి 10 గంటల సమయంలో 13 మందితో కూడిన ప్రత్యేక రెస్క్యూ టీం వచ్చి గాలింపు చర్యలను చేపట్టింది. ముగ్గురు యువకుల ఆచూకీ లభ్యం కాకపోవడంతో వారి తల్లిదండ్రులకు ఫోన్‌ద్వారా సమాచారం ఇచ్చారు. బయటపడిన యువకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తుండటంతో నదితీరమంతా శోకసంద్రంగా మారింది. ముగ్గురు ప్రాణమిత్రులు తమ కళ్లెదుటే నదిలో గల్లంతు కావడం జీర్ణించుకోలేకపోతున్నారు. ఆదివారం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టి గల్లంతైన వారిని వెలికితీసేందుకు కృషి చేస్తామని అధికారులు తెలిపారు. ప్రాణాలతో బయటపడిన యువకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



ప్రమాదం నుంచి బయట పడిన యువకులు, పోలీసులతో మాట్లాడుతున్న మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు

హెచ్చరికలు జారీ చేస్తున్నా.. నదిలో దిగవద్దు ప్రవాహం ఎక్కువగా ఉందని మైకులద్వారా హెచ్చరికలు జారీ చేస్తున్నా కూడా పట్టించుకోకపోవడంతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని శ్రీమఠం అధికారులు పేర్కొంటున్నారు. సంఘటన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, టీటీడీ బోర్డు మాజీ సభ్యులు సీతారామిరెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, మండల కన్వీనర్ పన్నగ వెంకటేశ్‌స్వామి విచారం వ్యక్తం చేశారు.

సమాజాభివృద్ధిలో సైన్స్ పాత్ర కీలకం

- విశ్రాంత ప్రొఫెసర్ దేవరాజ్ మహారాజ్



మాట్లాడుతున్న విశ్రాంత ప్రొఫెసర్ దేవరాజ్ మహారాజ్

కర్నూలు ఎడ్యుకేషన్/కల్చరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధిలో సైన్స్ పాత్ర కీలకమని విజ్ఞాన చింతన పరిశోధకుడు, విశ్రాంత ప్రొఫెసర్ దేవరాజ్ మహారాజ్ అన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం కర్నూలు నగరంలోని డీఏఎస్ కల్యాణ మండపంలో నిర్వహించిన విద్యా వైజ్ఞానిక రంగం దృక్పథం సదస్సుకు ఆయన ముఖ్య వక్తగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సైన్స్ వాస్తవాలకు అద్దం పడుతుందని, దీని వల్ల ప్రజలకు విజ్ఞానం బలమైన కృషి, సామర్థ్యాన్ని, శ్రమైక జీవన సౌందర్యాన్ని గౌరవించే పద్ధతులను పెంపొందిస్తుందన్నారు.

మతతత్వం వల్ల సమాజం తీవ్ర స్థాయిలో కలుషితమవుతోందన్నారు. సమాజంలో మూఢనమ్మకాలు విస్తృతమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మనిషికి మించిన అతీత శక్తి మరొకటి లేదన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్ కుమార్ మాట్లాడుతూ విజ్ఞానం భావితరాల ఆస్తిగా మారాలన్నారు. ఈ కార్యక్రమానికి సుందరయ్య విజ్ఞాన కేంద్రం నాయకులు ధనుంజయ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్, రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, ఉర్దూ వర్సిటీ డీన్ అక్తర్‌బాను, నరసింహ, సుందర విజ్ఞా కేంద్రం నాయకులు ప్రసాద్ శర్మ, రంగస్వామి, జేవీవీ జిల్లా అధ్యక్షుడు చంద్రమోహన్, సుధీర్‌బాబు పాల్గొన్నారు.

పలుచోట్ల చోరీలు

- ఓర్వకల్లు, పత్తికొండ మండలాల్లో పేట్రేగిపోయిన దొంగలు
- చాగలమర్రిలో చోరీయత్నం



కాల్వబుగ్గలో చోరీకి గురైన హుండీలు ఇవే



ఆలయంలో చోరీ చేస్తున్న దుండగులు

ఓర్వకల్లు, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయంలో శనివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు ఆలయం ప్రధాన ద్వారం గుండాలోనికి ప్రవేశించారు. ఆలయం గర్భగుడికి పడమర ఉన్న కటాంజనం వాకిలికి లోపల ఉన్న తాళాన్ని ఇనుపరాడ్డుతో పగలగొట్టి లోనికి చొరబడి అమ్మవారి, శివుడి ఎదురుగా ఉన్న ఐదు చిన్న హుండీలను ఎత్తుకెళ్లారు. హుండీలను చిన్న కోనేరు సమీపంలోకి తీసుకెళ్లి పగలగొట్టి అందులో ఉన్న చిల్లర మినహా మిగతా నగదును అపహరించుకుని పెద్ద కోనేరు సమీపం నుంచి దుండగులు వెళ్లిపోయారు. అయితే కానుకలు ఎక్కువగా ఉన్న రెండు పెద్ద హుండీలను ఎత్తుకెళ్లేందుకు సాధ్యపడక దుండగులు వదిలేశారు. తలుపులు తెరిచి ఉండటాన్ని ఉదయం వాచ్‌మన్ గమనించి ఈవో మద్దిలేటి దృష్టికి తీసుకెళ్లగా ఆయన పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆలయానికి చేరుకుని చోరీకి గురైన ప్రదేశాన్ని పరిశీలించారు. ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ముఖాలకు మాస్కులు ధరించి ఆలయంలో చోరీకి పాల్పడినట్లు సీసీ ఫుటేజ్ ద్వారా పోలీసులు గుర్తించారు. సుమా రు రూ.20 వేల నుంచి రూ.30 వేలు నగదు ఉండొచ్చని సమాచారం. ఆలయ ఈవో మద్దిలేటి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చిన్నహుల్తిలో 4 తులాల బంగారం అపహరణ

పత్తికొండ టౌన్: మండలంలోని చిన్నహుల్తి గ్రామంలో శనివారం పట్టపగలే ఓ ఇంట్లో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన బోయ రాజశేఖర్ ఇంటికి తాళం వేసుకుని వ్యవసాయ పనుల కోసం భార్యాభర్తలు కలిసి పొలం పనులకు వెళ్లారు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉంచిన నాలుగు తులాల బంగారం ఆభరణాలను ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు సీఐ జయన్న ఘటనా స్థలానికి వెళ్లి విచారణ జరిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

చాగలమర్రిలో ఆరు దుకాణాల్లో చోరీయత్నం

చాగలమర్రి: గ్రామంలోని గాంధీ బజార్‌లో శుక్రవారం అర్ధరాత్రి కొందరు దొంగలు హల్‌చల్ చేశారు. వ్యాపార సముదాయం ఉండే ప్రదేశంలోని దుకాణాల తాళాలు, తలుపులు పగలగొట్టి చోరీయత్నం చేశారు. బైసాని మురళి, సుంకు ఆనంద్, గురుప్రసాద్, సుదర్శన్, ఇర్షాద్, సుగుణాకర్‌కు చెందిన ఇళ్ల ముందు ఉన్న దుకాణాల తలుపులు, తాళాలను పగలగొట్టారు. శబ్దాలు రావడంతో ఆయా గృహాల్లో నిద్రిస్తున్న వారు ఉలిక్కిపడి కేకలు వేయడంతో దొంగలు పారిపోయారు. దొంగలు ఒకే రోజు ఆరు దుకాణాల్లో చోరీయత్నం జరగడంతో వ్యాపారులు, ప్రజలు భయాందోళనకు గురయ్యారు. వ్యాపారులు ఫిర్యాదు చేయడంతో ఘటనా స్థలాలను పోలీసులు పరిశీలించారు.



పత్తికొండ : చిన్నహుల్తిలో విచారిస్తున్న సీఐ

గుంతల దారులు...

ఇబ్బంది పడుతున్న ప్రజలు

ఏళ్ల నాటి నుంచి మరమ్మతులకు నోచుకోని రోడ్లు


అధ్వానంగా మారిన మిట్టకందాల, మద్దూరు రహదారి

పాములపాడు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్ట కందాల, మద్దూరు రహదారి. మిట్టకందాల, మద్దూరు, క్రిష్ణరావుపేట, మిట్టకందాల, క్రిష్ణారావుపేట, చెలిమిళ్ల గ్రామాల రహదారులు అడుగడుగుకో గుంత ఏర్పడింది. ఈ రోడ్లపై ప్రయాణం నరకాన్ని తలపిస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారులకు మరమ్మతులు చేపట్టాలని అనేక సార్లు అధికారులను, ప్రజాప్రతినిధులను కోరినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. రెండు కిలోమీటర్ల దూరం సుమారు అరగంట పడుతుందన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి రహదారులకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


గుంతలమయంగా మారిన క్రిష్ణరావుపేట, మిట్టకందాల రహదారి

చంద్రబాబువి మోసపూరిత హామీలు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

వెలుగోడు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు మోసపూరితమని మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. శనివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఏడాదిలో నియోజవర్గానికి చేసిందేమీ లేదన్నారు. టీడీపీ నాయకులు ఇసుక దందాలు, బెల్టు దుకాణాలు విచ్చల విడిగా నడిపిస్తున్నారని ఆరోపిస్తున్నారు. రేషన్ డీలర్లకు డబ్బులు ముట్టచెప్పి పేదలకు బియ్యం అందించకుండా నగదు అందచేసి బియ్యాన్ని కాజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు భువనేశ్వరరెడ్డి, సర్పంచ్ జయపాల్, ఎంపీపీ లాలం రమేశ్, అంబాల ప్రభాకరరెడ్డి తిరుపెంరెడ్డి, ఇలియాస్‌ఖాన్, చికెన్‌బాబు, వెంకటరామిరెడ్డి, నాగేశ్వరరెడ్డి, బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నారాయణ కళాశాల వార్షికోత్సవం


జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభిస్తున్న కోర్ డీన్ లింగేశ్వరరెడ్డి

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఆర్కే ఫంక్షన్‌హాల్‌లో నారాయణ జూనియర్ కళాశాల 15వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, వివిధ పోటీపరీక్షల చర్చావేదికలు, అధ్యాపకుల ఉపన్యాసాలు, ఉర్రూతలూగించే ఆటపాటలు నిర్వహించారు. నారాయణ విద్యాసంస్థల కోర్ డీన్ రామలింగేశ్వరరెడ్డి మాట్లాడుతూ జేఈఈ అడ్వాన్స్, మెయిన్స్, ఈఏపీ సెట్. ఐపీఈ పరీక్షల్లో తమ విద్యార్థులు సత్తాచాటి నంద్యాల కీర్తిని రాష్ట్ర స్థాయిలో నిలుపుతున్నారని కొనియాడారు. ఇంటర్ తర్వాత పోటీ పరీక్షల ప్రాముఖ్యతను వివరిస్తూ వాటికి నారాయణ విద్యాసంస్థలు ఏ విధంగా విద్యార్థులను ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం చేస్తుందో వివరించారు. కార్యక్రమంలో డీన్ వెంకటేశ్వర్లు, ఏజీఎం అంజన్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ క్రిష్ణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


రామకృష్ణారెడ్డి దంపతులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): నంద్యాల శ్రీరామకృష్ణా డిగ్రీ కళాశాలలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 1998 నుంచి 2002 బ్యాచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కళాశాల ఛైర్మన్ డాక్టర్ జి.రామకృష్ణారెడ్డి, విజయకుమారి దంపతులు, డైరెక్టర్ హేమంత్‌రెడ్డి, పూర్వ అధ్యాపకులు సురేష్‌కుమార్, భార్గవి, నాగేంద్ర, మధు విశ్వనాథ్, మహేంద్రగౌడ్, వెంకట్రావ్ పాల్గొన్నారు. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ 1984 లో స్థాపించిన కళాశాలలో ఎప్పటికప్పుడు మార్పు చెందుతూనే ఉందన్నారు. మనిషి తన స్వార్థం చూసుకోవడం మంచిది కాదని, అందరి గురించి ఆలోచిస్తూ ముందుకు వెళ్లాలన్నారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ 25 సంవత్సరాల తర్వాత ఎంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం దివ్యాంగుల పాఠశాలకు రూ.లక్ష విరాళంగా అందజేశారు.

ఏకలవ్య ట్రైబ్స్ ఫెడరేషన్ కార్యదర్శిగా శైలజ నియామకం



ఆత్మకూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఏకలవ్య ట్రైబ్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శిగా ఆత్మకూరు పట్టణానికి చెందిన నల్లగుండ్ల శైలజ నియమితులయ్యారు. శనివారం ఆమె మాట్లాడుతూ.. తనపై ఎంతో నమ్మకాన్ని ఉంచి అప్పగించిన బాధ్యతలకు న్యాయం చేసేందుకు తనవంతు కృషి చేస్తామన్నారు. ఎరుకుల కులస్థుల అభ్యున్నతికి, వారి హక్కుల సాధన, సంక్షేమానికి పాటుపడుతానన్నారు. అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని అన్నారు.

బూత్ లెవెల్ ఆఫీసర్లకు శిక్షణ

పాములపాడు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగూడూరు గ్రామంలో రైతు భరోసా కేంద్రం వద్ద 15న బూత్ లెవెల్ ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సుభద్రమ్మ తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గంలో భారత ఎన్నికల సంఘం ఇండియా ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ, ఎలక్షన్ మేనేజ్‌మెంట్ ఆదేశాల మేరకు బూత్ లెవెల్ ఆఫీసర్లకు ఎన్నికల జాబితా నిర్వహణ శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

అటవీ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు


వ్యాపారులతో మాట్లాడుతున్న డీఆర్‌వో హైమావతి

మహానంది, జూలై 12 (ఆంధ్రజ్యోతి): అటవీ భూముల్లో శాశ్వత కట్టడాలు నిర్మిస్తే చర్యలు తప్పవని మహానంది పార్వతీపురం కాలనీలో వ్యాపారులను డీఆర్‌వో హైమావతి హెచ్చరించారు. కాలనీలో స్థానికులు వ్యాపారాలు చేసుకుంటూ అటవీ స్థలంలో శాశ్వత కట్టడాలు నిర్మిస్తున్నారని తెలుసుకుని డీఆర్‌వో అక్కడికి చేరుకుని కట్టడాలను తొలగించారు. తొలగించుకోవడానికి వ్యాపారులు సమయం కోరడంతో కొంత గడువునిచ్చారు. కార్యక్రమంలో ఎఫ్‌ఎస్‌వో కుమార్, నాగేంద్రయ్య, శ్రీనివాసులు, రాణాప్రతాప్, శంకరీబాయ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే


భాస్కరాపురంలో ఇంటింటికి వెళ్లి పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

జూపాడుబంగ్లా, జూలై 12 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలు చేయడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. శనివారం మండలంలోని భాస్కరాపురం గ్రామంలో 'తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల అమలు గురించి వివరించారు. కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లుయాదవ్, టీడీపీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జీ గిరీశ్వరరెడ్డి, టీడీపీ నాయకులు రమణారెడ్డి, శ్రీనివాసులు, వేణుగోపాల్‌రెడ్డి, రవికాంత్, మహేశ్వరరెడ్డి, ప్రసన్నలక్ష్మి, స్వామన్న, ఉసేనయ్య పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


తొగర్చేడులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

పాణ్యం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శనివారం తొగర్చేడులో 'తొలి అడుగు'లో ఆమె పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన ప్రతి హామీని నెరవేర్చడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఇప్పటికే సూపర్‌సిక్స్‌లో భాగంగా పింఛన్ పెంపు, మెగా డీఎస్సీ, ఉచిత గ్యాస్, 'తల్లికి వందనం' పూర్తి చేశామన్నారు. వైసీపీ రాష్ట్రాన్ని అధోగతి పట్టించి, అన్ని వర్గాలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ముఖ్యంగా రైతులు భూ సర్వేతో మరింత నష్టపోయారన్నారు. రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయినా టీడీపీ అభివృద్ధి బాట పట్టించిందన్నారు. పాణ్యం మండలంలో ఇప్పటికే రూ. 20 కోట్లతో రహదారులు, తాగునీరు, మురుగుకాల్వలు తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. విద్యార్థులకు మాట ఇవ్వకపోయినా మధ్యాహ్న భోజనానికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. కుటుంబంలో ఒక్కరికే ఇచ్చే అమ్మఒడిని తల్లికి వందనంతో కుటుంబంలోని ప్రతి విద్యార్థికి అందేలా చర్యలు చేపట్టామన్నారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రభుత్వ పనితీరును తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ జయరామిరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, రామిరెడ్డి, ఈశ్వరరెడ్డి, నరేంద్రనాథ్ రెడ్డి, నంద్యాల రవి, దానం, రాంమోహన్‌నాయుడు, రాంపుల్లారెడ్డి, అమరసింహారెడ్డి, కేశవులు, ఏఎస్ఐ రఫీక్, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు

వర్గీకరణ ఫలాలు అందరికీ అందేలా చూడాలి


అమలాపురంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆత్మకూరురూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): అన్ని సామాజిక వర్గాలతో అనుకూలంగా ఉంటూ సాధించుకున్న వర్గీకరణ ఫలాలు అందరికీ అందేలా చూడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు చిలుక రాబిన్‌సన్‌రాజు, జిల్లా అధికార ప్రతినిధి భాషపోగుల దరగయ్య అన్నారు. శనివారం మండలంలోని అమలాపురం, శ్రీపతిరావుపేట గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఎగుర వేశారు. వారు మాట్లాడుతూ.. ఒక పక్క వర్గీకరణ కోసం పోరాడుతూనే మరో పక్క సామాజిక వర్గాల కోసం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు చేసి ఆరోగ్యశ్రీ పథకం, వృద్ధులు ,వికలాంగులు, వితంతువుల పెన్షన్‌ల కోసం పోరాటాలు చేసి సాధించిన ఘనత ఎమ్మార్పీఎస్‌కే దక్కిందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బుజ్జి మాదిగ, నాయకులు నాగయ్య, పుల్లయ్య, చిన్న వెంకటరమణ,దాసు, దరగయ్య, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

జీతాలు పెంచకుంటే సమ్మెలోకి వెళ్తాం


మాట్లాడుతున్న ఏసురత్నం

ఆత్మకూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జీవోఎంఎస్ నెం.36 ప్రకారం జీతాలు పెంచాలని, లేని పక్షంలో నిరవధిక సమ్మెలోకి వెళ్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు నాగన్న, పెద్దనాగరాజు పేర్కొన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట దీక్షా శిబిరంలో వారి నిరసనలు కొనసాగాయి. అనంతరం వారు మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ కార్మికులు నిరంతరం ప్రజలకు విద్యుత్, నీటి సౌకర్యం కల్పిస్తూ ఎలాంటి అంతరాయం లేకుండా విధులు నిర్వహిస్తున్నారన్నారు. గతంలో సమ్మె చేసిన సందర్భంగా ప్రభుత్వం కార్మికులకు జీతాలు పెంచుతామని హామీ ఇచ్చి ఇంతవరకు అమలుపర్చలేదని అన్నారు. మున్సిపల్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ బకాయిలను చెల్లించాలన్నారు. ఆయా సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సువర్ణమ్మ, సుశీలమ్మ, తిమ్మయ్య, జయన్న, రాజు, రమేష్, స్వాములు, విజయ్‌కుమార్, లింగస్వామి, రవి తదితరులు ఉన్నారు.

ఉపాధి వేతనం రూ.307 పొందేలా పని చేయాలి

- ద్వామా పీడీ సూర్యనారాయణ


సుగాలిమెట్టలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న పీడీ

పాణ్యం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : రోజువారి ఉపాధి కూలి రూ.307 పొందేలా కూలీలు పని చేయాలని నంద్యాల జిల్లా డ్వామా పీడీ సూర్యనారాయణ పేర్కొన్నారు. శనివారం ఆయన మండలంలోని సుగాలిమెట్ట గ్రామ పంచాయతీ పరిధిలోని ఉపాధి పనులు పరిశీలించారు. కూలీలు సమయ పాలన పాటించాలన్నారు. ఉపాధి సిబ్బంది ఇచ్చిన కొలతల ప్రకారం పని చేసినట్లయితే రోజుకు రూ. 307లు వేతనం పొందవచ్చన్నారు. నీటి వసతి కలిగిన రైతులు తమ స్థలాల్లో ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలన్నారు. పండ్ల తోటల్లో నాటుకోవడానికి వంద శాతం సబ్సిడీతో మొక్కలు అందజేస్తున్నట్లు తెలిపారు. ఎకరాలో మొక్కలు నాటితే మూడేళ్లలో రూ. 1. 30 లక్షల ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీఓ శేషన్న, ఈసీ శివారెడ్డి, టీఏ ప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణమ్మ, మేట్లు, ఉపాధి కార్మికులు పాల్గొన్నారు.

మహానందిలో న్యాయాధికారి పూజలు


న్యాయాధికారిని సత్కరిస్తున్న ఆలయ అధికారులు

మహానంది, జూలై 12(ఆంధ్రజ్యోతి): మహానందీశ్వర స్వామి వారిని ఆళ్లగడ్డ ఫస్ట్‌క్లాస్ న్యాయాధికారి భాస్కర్ దంపతులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. స్వామివారి దర్శనార్థం మహానందికి చేరుకున్న ఆళ్లగడ్డ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ న్యాయాధికారి భాస్కర్ కుటుంబానికి ఆలయ పర్యవేక్షకులు మల్లయ్య ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. అనంతరం న్యాయాధికారి స్వామిఅమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు రవిశంకర అవధాని వేద మంత్రోచ్ఛారణల మధ్య న్యాయాధికారి దంపతులకు కండువా కప్పి స్వామివారి ప్రసాదాలను అందజేశారు. వారి వెంట కానిస్టేబుల్ శేషన్న ఉన్నారు.

అహోబిలేశుడిని దర్శించుకున్న గాయకుడు

ఆళ్లగడ్డ, జూలై 12(ఆంధ్రజ్యోతి): అహో లాన్ని ప్రముఖ గాయకుడు ప్రకాష్ శనివారం కుటుంబసమేతంగా ద ర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. లక్ష్మీనరసిం హ స్వామికి ప్రకాష్ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఆ లయ విశిష్టత, శిల్పకళాకృతుల గురించి వివరించారు. స్వామి గురించి ప్రకాష్ పాటలు పాడి అందరిని అలరించారు.

రైతులను ఆదుకోండి


మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పండిన పంటలకు సరైన మద్దతు ధర లభించక రైతులు తీవ్రంగా నష్టపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, రైతులను ఆదుకోవాలని నంద్యాల రైతు సం ఘం నాయకులు కోరారు. శనివారం నరసింహయ్య భవన్‌లో నిర్వహించిన సమావేశం నిర్వహించారు. రైతుసంఘం నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రాజశేఖర్ మాట్లాడుతూ పంటలకు పెట్టుబడులు పెరిగిపోయాయని, దిగుబడులు మాత్రం తగ్గిపోతున్నాయన్నారు. అరకొర పండిన పంటలకు మద్దతు ధర లేక రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని ప్రాజెక్టుల్లో నీళ్ల సమృద్ధిగా ఉన్నా నీటి విడుదలలో సకాలంలో కాల్వలకు వదలకపోవడం వల్ల మెట్టపైర్లు ఎండిపోతున్నాయని అన్నారు. ప్రభుత్వం వెంటనే పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రామచంద్రుడు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ ఫ్యాక్టరీని ముట్టడిస్తాం: సీపీఐ



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు

నంద్యాల రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రాంకో సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్య వైఖరి మార్చుకోకపోతే ఫ్యాక్టరీని ముట్టడిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు అన్నారు. శనివారం సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కొలిమిగుండ్ల మండలం కల్వటాల గ్రామంలో రాంకో సిమెంట్ పరిశ్రమ ఏర్పడి కొన్ని ఏళ్లు అయినప్పటికీ రైతులనుంచి తీసుకున్న పొలాలకు పరిహారం ఇవ్వలేదన్నారు. నష్టపరిహారం ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న వైఖరిని నిరసిస్తూ గవర్నర్, సీఎం, డిప్యూటీ సీఎంలతో పాటు పలు పార్టీలకు చెందిన నాయకులకు లేఖలు రాయడం జరిగిందన్నారు. ఫ్యాక్టరీ చుట్టుపక్కల కాలుష్యం వల్ల రైతులు పంటలు నష్టపోతున్నాయన్నారు. పంట నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. భూములు ఇచ్చిన రైతుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇచ్చి ఉపాధి కల్పించాలని కోరారు. స్థానికులకే 75 శాతం ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. ఈసమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోండి


మాట్లాడుతున్న న్యాయవాది వెంకటరమణ

నందికొట్కూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం 3వ రోజు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద న్యాయ విజ్ఞాన సదస్సును న్యాయవాదులు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాది వెంకటరమణ మాట్లాడుతూ సివిల్ కేసుల ప్రాముఖ్యతను గురించి వివరించారు. అనేక సంవత్సరాల నుంచి కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులలో మధ్యవర్తిత్వం ద్వారా రాజీ చేసుకునే వెసలుబాటు కోర్టులు కల్పిస్తున్నాయన్నారు. కేసులోని ఇరుపక్షాలు రాజీకి ప్రయత్నం చేస్తే కోర్టులోని మధ్యవర్తి లాయరు ద్వారా అప్పీలు లేని అంతిమ తీర్పులు పొందవచ్చన్నారు. రాజీ కావాలనుకునే కక్షిదారులు స్థానిక కోర్టులో గానీ, జిల్లా కోర్టులో గాని ఇరుపక్షాలు స్వయంగా గాని లేఖ ద్వారా తెలుపవచ్చన్నారు. అట్టి వారికి మధ్వర్తిత్వం ద్వారా రాజీ చేసుకునే అవకాశం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్లు శోభారాణి, కెజీయా, రెహ్మాన్, హుస్సేన్ పాల్గొన్నారు.

గుండెపోటుతో కూలీ మృతి

పాములపాడు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పాములపాడు గ్రామానికి చెందిన బాల సుందరం అనే కూలీ గుండెపోటుతో మృతి చెందాడు. చెలిమిళ్ల గ్రామంలోని భూషణం అనే రైతు మొక్కజొన్న పొలంలో ఉండగా ఆకస్మాత్తుగా గుండెపోటు వచ్చింది. వెంటనే ఆయనను పాములపాడు ప్రైవేటు వైద్యశాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి భార్య ఈ ఏడాది మార్చిలో మిరపపండు తెంచేందుకు గుంటూరుకు వెళ్లి వడదెబ్బతో మరణించింది. వరుసగా ఒకేఇంట్లో ఇంటి పెద్దలు చనిపోవడంతో ఇంట్లో విషాద చాయలు అలుముకున్నాయి.

చాక్లెట్ ఇచ్చారని..

చెప్పుతో కొట్టిన లెక్చరర్

- విద్యార్థి సంఘాల జోక్యంతో సద్దుమణిగిన సమస్య

ఆత్మకూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): విద్యాబుద్ధులు నేర్పించాల్సిన గురువులే సహనం కోల్పోతున్నారు. వారు ఏమి చేస్తున్నారో వారికే తెలియకుండా ప్రవర్తిస్తున్నారు. తప్పు చేసిన విద్యార్థులను మందలించాల్సింది పోయి చెప్పుతో కొట్టిన ఘటన ఆత్మకూరు పట్టణంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. వారం రోజుల క్రితం ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న ఓ విద్యార్థి అదే తరగతికి చెందిన ఓ విద్యార్థినీకి చాక్లెట్‌ను మరో విద్యార్థితో ఇప్పించాడు. విద్యార్థినీ తరగతిలో ఉన్న అధ్యాపకురాలికి విషయం చెప్పింది. చాక్లెట్ ఇచ్చిన విద్యార్థిని తిడుతూ.. ఇవ్వమని చెప్పిన విద్యార్థిని లెక్చరర్ చెప్పుతో కొట్టింది. దీంతో ఆ విద్యార్థి ఇంట్లో వాళ్లకు విషయం చెప్పాడు. వారు కళాశాల ప్రిన్సిపాల్ వద్దకు సమస్యను తీసుకెళ్లారు. పిల్లలను చెప్పులతో కొట్టడమేమిటని, అవమానం భరించలేక ఏమైనా అఘాయిత్యం చేసుకుంటే బాధ్యులు ఎవరని నిలదీశారు. సమస్య విద్యార్థి సంఘాల నాయకులకు చేరింది. వారి సమక్షంలోనే సదరు అధ్యాపకురాలితో రాజీ కుదుర్చుకుని సమస్యను సద్దుమణిగించినట్లు తెలిసింది. ఈవిషయంపై ఇంటర్ బోర్డు అధికారులు ఏవిధంగా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

మందలించి సంజాయిషీ..

తమ కళాశాలలో పని చేస్తున్న ఓ కాంట్రాక్ట్ లెక్చరర్ విద్యార్థిని చెప్పుతో కొట్టిన మాట వాస్తవమే. ఆమెను మందలించడంతో పాటు ఇలాంటి తప్పు మరోసారి చేయబోనని లిఖితపూర్వకంగా సంజాయిషీ రాయించుకున్నాం. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే విధుల నుంచి తొలగించేందుకు డీవీఈవోకు సిఫారసు చేస్తాం.

- సుంకన్న, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆత్మకూరు

జగజ్జననీ అమ్మవారికి పుట్టింటి సారె


సారె తీసుకెళ్తున్న భక్తులు

నంద్యాల కల్చరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం శనివారం సందర్భంగా నంద్యాలలో వెలసిన జగజ్జననీ అమ్మవారికి భక్తులు చీరె సారె సమర్పించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయాన్నే సుప్రభాత సేవ, పంచామృతఅభిషేకాలు, సుగంధద్రవ్యాలచే అభిషేకాలు చేసి పట్టువస్త్రాల అలంకరించి ప్రత్యేక దుర్గా ఫ్రెండ్స్ యూనిట్ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పలు జిల్లాలు, పట్టణాలు, గ్రామాల నుంచి మహిళలు అమ్మవారి ప్రతిమకు అలంకరించి పుట్టింటి పట్టుచీరె, సారెను మంగళవాయిద్యాలతో వచ్చి అమ్మవారికి సమర్పించారు. భక్తులు కోలాటం, భరతనాట్యం వంటి సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. దుర్గాఫ్రెండ్స్ యూనిట్ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వందలాది మంది మహిళా భక్తులు పాల్గొన్నారు.

కమనీయం.. వేంకటేశ్వరస్వామి కల్యాణం

● వైభవంగా స్వామి పల్లకీ ఉత్సవం



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న దంపతులు

చాగలమర్రి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు రాళ్లపల్లె గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తులకు వేద పండితుల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కల్యాణం అత్యంత కమనీయంగా సాగింది. అనంతరం స్వామిపల్లకి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్న దానం ఏర్పాటు చేశారు. ఎంపీపీ వీరభద్రుడు, సర్పంచ్‌లు, కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

రేపు కేసీ కాలువకు నీరు విడుదల



రాజోలి ఆనకట్ట వద్ద నీటి ప్రవాహన్ని పరిశీలిస్తున్న డీఈ, ఏఈ

చాగలమర్రి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాజోలి ఆనకట్ట నుంచి సోమవారం కడప జిల్లావైపుగల కేసీ కెనాల్‌కు నీరు విడుదల చేస్తామని కేసీకెనాల్ డీఈ పుల్లయ్య తెలిపారు. శనివారం ఆనకట్ట వద్ద ప్రవహిస్తున్న నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ సంతజూటూరు నుంచి కేసీ కాలువకు నీరు విడుదల చేయడంతో రాజోలి ఆనకట్టవద్దకు నీరు చేరిందని, ప్రస్తుతం కుందూలో మూడువేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుందన్నారు. కేసీ ప్రధాన కాలువ ఆయకట్టు రైతులకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ దస్తగిరి, లస్కర్లు ఉన్నారు.

చౌడేశ్వరీ మాత జయంతి ఉత్సవాలకు ఆహ్వానం



బీసీ రాజారెడ్డికి ఆహ్వాన పత్రికను అందిస్తున్న కమిటీ సభ్యులు

బనగానపల్లె, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో ఈనెల 24న నిర్వహించనున్న అమ్మవారి జయంతి ఉత్సవాలకు హాజరు కావాలని ఆలయకమిటీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి కోరారు. శనివారం బనగానపల్లె పట్టణంలోని బీసీ గుర్రెడ్డి కాంప్లెక్స్‌లోని కార్యాలయంలో బీసీ రాజారెడ్డికి ఆహ్వాన పత్రికను అందించారు. కార్యక్రమంలో కాపులపల్లె సర్పంచ్ తులసిరెడ్డి, ఆలయ అర్చకులు ప్రదీప్‌స్వామి, నుసి లక్ష్మిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

చాగలమర్రి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని బీసీ సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్ తెలిపారు. శనివారం స్థానిక బీసీ సంఘం కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారన్నారు. బీసీ కార్పోరేషన్ ద్వారా నిధులు మంజూరు చేసి సబ్సిడీ రుణాలు అందించాలని కోరారు. నాయకులు రామతీర్థం, పీరయ్య, సిద్ధప్ప, సుబ్బరాయుడు, లాలయ్య, పుల్లయ్య, చిన్నికృష్ణయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జియారత్



ఆల్వకొండలో మౌలాలి దస్తగిరిస్వామి పీర్ల గ్రామోత్సవం

సంజామల, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆల్వకొండ గ్రామంలో వెలిసిన మౌలాలి దస్తగిరిస్వామి పీర్ల జియారత్ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చావిడ్లలో కొలువైన స్వామివారి పీర్లకు ప్రత్యేక ఫతేహాలు సమర్పించి శుక్రవారం అర్ధరాత్రి నుంచి జియారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్లను గ్రామోత్సవం చేశారు. స్వామి వారి పీర్లు తెల్లారి 10గంటల వరకు గ్రామంలో తిరిగి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం పీర్లను కొండపై ఉన్న చావిడిలో కొలువుదీర్చారు.

కొలిమిగుండ్ల మండలంలో..

కొలిమిగుండ్ల : మండలంలోని నందిపాడు, పెట్నీకోట గ్రామాల్లో మొహర్రం కొనసాగుతోంది. నందిపాడు గ్రామంలో శనివారం చిన్న సరిగెత్తు నిర్వహించారు. పీర్ల స్వాములను ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు, పూజలు నిర్వహించి, గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

క్లస్టర్, బూత్ ఇన్‌చార్జీలకు శిక్షణ

డోన్ టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలకు పట్టణంలో టీడీపీ కార్యాలయం వద్ద శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోత్రికే ఫణిరాజ్, లక్కసాగరం విజయకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలన్నారు. నాయకులు టీఈ రాఘవేంద్రగౌడు, తదితరులు పాల్గొన్నారు.

'విద్యుత్ చార్జీలు తగ్గించాలి'

ప్యాపిలి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలను తగ్గించాలని సీఐటీయూ మండల కార్యదర్శి చిన్నరహిమాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆ సంఘం కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. రహిమాన్ మాట్లాడూ స్మార్ట్ మీటర్ల యోచనను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు రామాంజినేయులు, రంగస్వామి, శ్రీనివాసులు, ఇలియాజ్, రవి పాల్గొన్నారు.

బీఎస్ఐ కార్యాలయం ప్రారంభం

కోవెలకుంట్ల, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఇందిరమ్మకాలనీలో శనివారం బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా (బీఎస్ఐ) కార్యాలయాన్ని బీఎస్ఐ రాష్ట్ర అధ్యక్షుడు నేషనల్‌ట్రస్టీ మెంబరు హరిబాబు ప్రారంభించారు. ముందుగా పట్టణంలోని బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బుద్ధిని విగ్రహాన్ని కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరూ బుద్ధుని బోధనలను ఆకళింపు చేసుకుని హేతుబద్ధమైన జీవన సంస్కృతిని నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఆదివారం ఉదయం 10.30గంటలకు బుద్ధుడి సందేశాలను వివరిస్తారన్నారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా నాయకులు చిరంజీవి, కార్యదర్శి రామలింగం,రాష్ట్ర బీఎస్ఐ సెక్రటరీ ఫణి, ప్రకాశం జిల్లా అధ్యక్షుడు నాగమహేశ్, సభ్యులు పాల్గొన్నారు.

కలుషిత నీరే దిక్కు..

● గుడిపాడులో ఆరు నెలలుగా రంగుమారిన నీరు సరఫరా
● రోగాల బారిన ప్రజలు
● పట్టించుకోని అధికారులు

ప్యాపిలి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో కలుషిత నీరు ప్రజలు తాగుతున్నారు. ఆరునెలలుగా ఇదే నీరు తాగుతుండటంతో గ్రామస్థులు రోగాల బారిన పడుతున్నారు. అయినా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గుడిపాడు గ్రామంలో దాదాపు 600 కుటుంబాలున్నాయి. రెండు రక్షిత మంచి నీటి పథకాలు ఉన్నా.. అందులో ప్రస్తుతం ఒకటి మాత్రమే పని చేస్తోంది. అందులో నూ కలుషిత నీరు వస్తుంది. ఈ నీటినే గ్రామంలోకి సరఫరా చేస్తున్నారు. గత్యంతరం లేక తాగాల్సి వస్తుందని గుడిపాడు గ్రామస్థులు వాపోతున్నారు. కలుషిత నీరు తాగి రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు గ్రామీణ నీటి సరఫరా శాఖ, పంచాయతీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కలుషిత నీటి కారణంగా ప్రాణాపాయం జరిగితే అధికారులే బాధ్యత వహించాలని ప్రజలు హెచ్చరిస్తున్నారు. స్థానిక అధికారుల తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్న ట్లు గ్రామస్థులు తెలిపారు. అలాగే పలు గ్రామాల్లోనూ కలుషిత నీరు సరఫరా అవుతోంది.



గ్రామంలో సరఫరా అవుతున్న కలుషిత నీరు



రంగుమారిన నీటిను చూపిస్తున్న గ్రామస్థులు

పట్టించుకోవడం లేదు



ఆరు నెలలుగా రంగుమారిన నీరు తాగుతున్నాం. గ్రామానికి వచ్చే అధికారులకు, పాలకులకు చెబుతూనే ఉన్నాం. ఎవరు పట్టించుకోవడం లేదు. కొలాయిలకు వచ్చేనీరే తమకు గత్యంతరం.

● చితంబరమ్మ, గుడిపాడు

గొంతులు ఎండిపోతున్నాయ్



కలుషిత నీరు తాగలేక చస్తున్నామని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అయినా వారిలో స్పందన లేదు. ఉన్నతాధికారులైనా స్పందించి గుక్కెడు తాగునీరు సరఫరా చేయాలి.

● నారాయణరెడ్డి, గుడిపాడు

పేదల సంక్షేమమే లక్ష్యం



కొమ్మెమర్రిలో కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

ప్యాపిలి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కొమ్మెమర్రి, బూరుగుల, కౌలపల్లి, సీతమ్మతండా గ్రామాల్లో నిర్వహించిన సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే పలు సంక్షేమ పథకాలు చేపట్టడంతో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు. గత ప్రభుత్వంలో అధోగతి పాలైన రాష్ట్రాన్ని చక్కదిద్దేందుకు సీఎం అహర్నిశలు కష్టపడుతున్నారన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రి దొరకడం రాష్ట్ర ప్రజల అదృష్టమన్నారు. అనంతరం గ్రామాల్లో ఇంటింటా తిరిగి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, డీసీఎంఎస్ చైర్మన్ వై నాగేశ్వరరావుయాదవ్, ప్రభాకర్‌రెడ్డి, వై లక్ష్మీనారాయణయాదవ్, ఆర్‌ఈ నాగరాజు, ఖాజాపీర్, వెంకటరాముడు, సుదర్శన్, శివారెడ్డి, హేమంత్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రమేష్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే అవసరం

● బనగానపల్లె జూనియర్ సివిల్ న్యాయాధికారి ప్రతిమ



యోగా, కరాటే క్రీడాకారులతో న్యాయాధికారి ప్రతిమ

బనగానపల్లె, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే యోగా, ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరమని బనగానపల్లె జూనియర్ సివిల్ న్యాయాధికారి ప్రతిమ అన్నారు. శనివారం పట్టణంలోని పెండేకంటి వెంకటసుబ్బయ్య స్టేడియంలో కరాటే మాస్టర్ బాష ఆధ్వర్యంలో యోగా, కరాటేపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన న్యాయాధికారి మాట్లాడుతూ యోగా, కరాటే నేర్చుకోవడం వల్ల భవిష్యత్‌లో ఆడపిల్లలు తమను తాము రక్షించుకోగలరన్నారు. ప్రస్తుతం పిల్లలు మొబైల్ గేమ్స్ కు బానిస కావద్దని సూచించారు. యోగా, కరాటేలను తల్లిదండ్రులు తమ పిల్లలకు నేర్పించి ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో యోగా మాస్టర్ మునిస్వామి, కరాటే మాస్టర్ ఫయాజ్, అడ్వకేట్ రఫి, పిడాహాసేన్, ఫిరోజ్, జియా, విక్రమం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

- ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ, జూలై 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. శనివారం పట్టణంలోని గాయత్రి నగరంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలకు సంబంధించిన కరపత్రాలను అందజేశారు. కాలనీలో నెలకొన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రమంతటా ఒక పండగ వాతావరణం నెలకొందన్నారు. తమ ప్రభుత్వం అందరికి అందుబాటులో ఉండే ప్రభుత్వమని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జాఫర్‌రెడ్డి, సెజ్జారెడ్డి, శ్రీనివాసరెడ్డి, శేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దొర్నిపాడు ఎస్సీ కాలనీలో..

దొర్నిపాడు: కూటమి ప్రభుత్వంలోనే ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని 36వ వార్డు కన్వీనర్ చలుంగారి అంకన్నయాదవ్, మాజీ సర్పంచ్ తులశమ్మ అన్నారు. శనివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎస్సీ కాలనీలో ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాల గురించి వివరించారు. పార్టీలకతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి కూటమి ప్రభుత్వం సంక్షేమ ఫలాలు అందిస్తోందని అన్నారు. కార్యక్రమంలో దస్తగిరి, మనోహర్, మద్దిలేటి, బాబయ్య తదితరులున్నారు.

గ్రామాల్లో బలోపేతం చేయాలి: జడ్పీ చైర్మన్

బనగానపల్లె, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీని గ్రామాల్లో బలోపేతం చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి కోరారు. శనివారం పట్టణంలోని ధనలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో వైసీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల , మాజీ ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కాటసాని రామిరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయడం లేదన్నారు. సమావేశంలో చల్లా విఘ్నేశ్వరరెడ్డి, కాటసాని ఓబుళరెడ్డి, నియోజకవర్గంలోని ఐదు మండలాల వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

బనగానపల్లె, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందవరం ఆలయాభివృద్ధికి అనంతపురం జిల్లాకు చెందిన షణ్ముఖరెడ్డి, శ్వేత కుటుంబ సభ్యులు శనివారం విరాళం అందించారు. అర్చకుల సమక్షంలో దాతలు ఆలయ అభివృద్ధి కోసం రూ.25వేల విరాళాన్ని ఆలయ కమిటీ చైర్మన్ పీ.వీ.కుమార్‌రెడ్డి అందించారు.

వాల్టాకు తూట్లు

● యథేచ్ఛగా చెట్ల నరికివేత, తరలింపు



కొండమాయపల్లె సమీపంలో ట్రాక్టరులో తరలిస్తున్న వేప దుంగలు

రుద్రవరం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలో వాల్టా చట్టానికి తూట్లు పడుతున్నాయి. చెట్లను విచ్చలవిడిగా నరికి ట్రాక్టర్లలో తరలిస్తున్నా అటు రెవెన్యూ ఇటు ఫారెస్టు అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ఇలాగే నరుకుతూ పోతే భవిష్యత్ తరాల వారికి పచ్చదనం కనుమరుగయ్యే ప్రమాదం ఉందని పర్యావరణ ప్రియులు ఆవేదన వ్యక్తం చేశారు. చెట్లు నరికి వేయకుండా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

15న యాగంటి క్షేత్రంలో వేలం

బనగానపల్లె, జూలై 12 (ఆంధ్రజ్యోతి): యాగంటి ఉమామహేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 15న వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో పాండురంగారెడ్డి శనివారం తెలిపారు. పలు రకాల వస్తువులు విక్రయించేందుకు దేవాదాయశాఖ అధికారుల సమక్షంలో వేలం వేస్తామన్నారు. వేలం పాల్గొనేవారు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని కోరారు. వివరాలకు యాగంటి ఈవో కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

'జిల్లా మహాసభలు జయప్రదం చేయాలి'

డోన్ రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): డోన్‌లో ఈ నెల 30, 31 తేదీల్లో నిర్వహించనున్న సీపీఐ మహాసభలను జయప్రదం చేయాలని పట్టణ కార్యదర్శి మోట రాముడు కోరారు. శనివారం డోన్ పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌లో సీపీఐ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ ఇంటింటికి వెళ్లి విరాళాలు సేకరించారు. పేద ప్రజలకు అండగా ఉండే పార్టీ సీపీఐనే అన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు రణత్ యాదవ్, మహిళా సమైఖ్య నాయకురాలు అమృతారెడ్డి, మాధవి పాల్గొన్నారు.

'తల్లికి వందనం' సమస్యలపై ప్రత్యేక దృష్టి

కొలిమిగుండ్ల, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : 'తల్లికి వందనం' పథకం అందని అర్హులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మండల విద్యాధికారి అబ్దుల్‌కలాం శనివారం పేర్కొన్నారు. ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకొని తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, సమస్యలు పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. తల్లిదండ్రులు ఎవరూ ఆందోళన చెందకుండా అధికారులను సంప్రదించాలని కోరారు.

కల్వటాలలో వివాదం

- పోలీస్ స్టేషన్ ఆశ్రయించిన బాధితులు

కొలిమిగుండ్ల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వటాల గ్రామంలో శనివారం తీవ్ర వివాదం నెలకొంది. గ్రామానికి చెందిన వంకదార నిర్మల, వంకదార శీను ఇంటి వద్ద అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు వరి కోత యంత్రాలు పెట్టడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. దీంతో వంకదార లీలావతి దంపతులు స్థానిక పోలీస్ స్టేషన్ ఆశ్రయించి ఫిర్యాదుచేశారు. అయితే సదరు ఇంటి స్థలంపై చాలా కాలంగా వివాదం నడుస్తోంది.

మద్యం దుకాణాల తనిఖీ

ఆళ్లగడ్డ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ క్రిష్ణాపురం గ్రామంలో మద్యం దుకాణాలను ఎక్సైజ్ సీఐ విజయ్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం మద్యం విక్రయించాలన్నారు. బెల్టుషాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ నిర్ణయించిన రేట్ల కంటే అధికంగా అమ్మినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎక్సైజ్ ఎస్ఐ చంద్రవతి పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపకూడదు : ఎస్ఐ

రుద్రవరం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలు నడపకూడదని ఎస్ఐ మహ్మద్‌రఫీ అన్నారు. శనివారం ఆలమూరు గ్రామంలో రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పించారు. అతివేగంతో వాహనాలు నడుపరాదని సూచించారు. ప్రతి వాహనానికి ఇన్సూరెన్స్ ఉండాలన్నారు. బీమా ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు.

వైభవంగా జగన్నాథుడి రథోత్సవం



జగన్నాథస్వామి రథాన్ని లాగుతున్న భక్తులు

రుద్రవరం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరంలో శనివారం జగన్నాథ రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రథాన్ని పూలతో అలంకరించారు. జగన్నాథుడి ప్రతిమలు రథంలో ఏర్పాటు చేసి ముందుకు లాగారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి రథోత్సవంలో పాల్గొన్నారు.

నరసింహస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు

రుద్రవరం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నరసాపురం, రుద్రవరం నరసింహస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి వేద మంత్రోచ్చారణల మధ్య పూజలు ప్రారంభించారు. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

వాసాపురంలో..

మండలంలోని వాసాపురంలో వేంకటేశ్వరస్వామి, లక్ష్మీగోదాదేవి అమ్మవార్లను మానస లింగేశ్వరస్వామివారిని, త్రిపురసుందరీదేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. తరలివచ్చిన భక్తులకు దేవాలయాల ఆవరణంలో తీర్థప్రసాదాలు పంచారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

రుద్రవరం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : అప్పులబాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయకార్యదర్శి రామచంద్రుడు, మండల సహాయ కార్యదర్శి శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం రుద్రవరంలో వారు మాట్లాడుతూ జిల్లాలో శుక్రవారం ఒక్కరోజే అప్పుల భారంతో ముగ్గురు రైతులు ఆత్మహత్య చేసుకోవడం దురదుష్టకరమన్నారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి అన్నిరకాల పంటలకు మద్దతు ధరలు ఇస్తే ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఉండదన్నారు. స్వామినాథం కమిషన్ సూచించిన వివిధ సీటుప్లస్ 50ఫార్ములా ప్రకారం మద్దతు ధర ప్రకటించి చట్టబద్ధత కల్పించాలని అన్నారు.

అహోబిలేశుడిని దర్శించుకున్న గాయకుడు

ఆళ్లగడ్డ, జూలై 12(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలాన్ని ప్రముఖ గాయకుడు ప్రకాష్ శనివారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. లక్ష్మీనరసింహ స్వామికి ప్రకాష్ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ విశిష్టత, శిల్పకళాకృతుల గురించి వివరించారు. స్వామి గురించి ప్రకాష్ పాటలు పాడి అందరిని అలరించారు. గాయకుడు ప్రకాష్ మాట్లాడుతూ స్వామివారిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు.

సద్వినియోగం చేసుకోండి

డోన్ టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఈనెల 15న పాణ్యం ఎంపీడీవో కార్యాలయంలో దివ్యాంగులు, వృద్ధుల కోసం నిర్వహిస్తున్న అసెస్‌మెంటు క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ఫాతిమా శనివారం తెలిపారు. ఈనెల 11న డోన్ నియోజకవర్గంలోని మూడు మండలాలకు సంబంధించిన దరఖాస్తు ప్రక్రియ పూర్తయిందన్నారు. మిగిలిన వారు పాణ్యంలో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. దర ఖాస్తులను రిజిస్ట్రేషన్ చేసుకున్న అర్హులైన వారికి త్వరలో బ్యాటరీ సైకిళ్లు, వీల్ చైర్లు, ట్రై సైకిళ్లు, కృత్రిమ పరికరాలు అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని దివ్యాంగులు, వృద్ధులు వినియోగించుకోవాలని ఆమె కోరారు.

ఏపీఎస్ఎస్‌డీసీఎల్ చైర్మన్‌కు తప్పిన ప్రమాదం

డోన్ టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డికి ప్రమాదం తప్పింది. శనివారం ఆదోనిలో జరిగే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం లో పాల్గొనేందుకు వెళ్తుండగా.. మార్గమధ్యలో పత్తికొండ సమీపంలో సుబ్బారెడ్డి వాహనాన్ని ఆటో ఢీకొట్టింది. ప్రమాదం తప్పడంతో కార్యకర్తలు ఊపిరి పీల్చుకున్నారు. దీంతో ఆయన వేరే వాహనంలో వెళ్లి సుపరిపాలన కార్యక్రమంలో పాల్గొన్నారు.

బీసీ మహాసభలను జయప్రదం చేయాలి

ప్యాపిలి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17న విజయవాడలో జరిగే బీసీ మహాసభలను జయప్రదం చేయాలని బీసీ రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షుడు చల్లా అనుదీప్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని బీసీ కార్యాలయంలో మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆయన విడుదల చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు వెంగళరావుయాదవ్ మహాసభల్లో పాల్గొననున్నట్లు అనుదీప్ తెలిపారు. మండలంలోని బీసీలు హాజరై విజయవంతం కావాలని కోరారు. కార్యక్రమంలో చంద్ర, వెంకటేశ్, మహమ్మద్ రఫీ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

డోన్ సహకార సంఘం చైర్మన్‌గా ఎల్లగౌడ్

● ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



డోన్ టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): డోన్ సహకార సంఘం చైర్మన్‌గా చిన్న పూజర్ల ఎల్లాగౌడును ఎంపిక చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎల్లగౌడుతో పాటు సభ్యులుగా ఎం.మల్లికార్జున, గొల్ల సుంకన్న ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎల్లాగౌడు ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే నమ్మకాన్ని వమ్ము చేయకుండా రైతుల అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. తనను ఎంపిక చేసినందుకు నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

రైతుల సంక్షేమమే నాబార్డు ధ్యేయం



మొక్కను నాటుతున్న నాబార్డు సిబ్బంది, రైతులు

ప్యాపిలి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే నాబార్డు ధ్యేయమని ఆ సంస్థ ఇంజనీరింగ్ అధికారి రాకేష్ వర్మ అన్నారు. శనివారం పట్టణంలోని కార్యాలయంలో నాబార్డ్ 44వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వాటర్ షెడ్, ఇతర కార్యక్రమాల ద్వారా పేదలు, రైతుల ఆర్థికాభివృద్ధికి తమవంతు సాయం అందిస్తుందన్నారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ నాబార్డు సేవలను అభినందించారు. అనంతరం కార్యాలయం ఆవరణలో రైతులు, సిబ్బంది మొక్కలు నాటారు. కార్యక్రమంలో కలచట్ల వాటర్ షెడ్ ట్రెజరర్ రవి, రాంమూర్తి, సుబ్రమణ్యం, ఈశ్వర్, రైతులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.